PRGI NO : TGTEL/26/A2002

EDITOR: PEMBI MAHENDHAR

# నవగీతం

NAVAGEETAM DINAPATHRIKA

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ | సంపుటి : 1 | సంచిక : 65 | పేజీలు : 8 | ఆదివారం 2 ఆగస్టు 2026 | వెల : 4/-




## మోడల్ సోలార్ విలేజ్ టెండర్లలో అవకతవకలు

- ప్రభుత్వం వద్ద కాంట్రాక్టు సంస్థ తీసుకున్నది రూ.1.36 లక్షలు
- పనిచేసిన సంస్థకు కాంట్రాక్టు సంస్థ ఇచ్చింది రూ.86 వేలు
- ఒక ఇంటి కనెక్షన్‌పై సుమారు రూ.50 వేలు మిగులు
- ప్యానెల్స్ నాణ్యతపై అనుమానాలు
- ప్రయోగాత్మకంగా 81 గ్రామాల్లో 40 వేల ఇళ్లకు అనుమతి



హైదరాబాద్

మోడల్ సోలార్ విలేజ్ టెండర్లలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. టెండర్లు దక్కించుకున్న సంస్థలు ఇళ్లపై సోలార్ ప్యానెల్స్ ఏర్పాటుచేసే పనిని సబ్ కాంట్రాక్టుకు ఇచ్చేసి.. ఒక్కో ఇంటిపై రూ.40 వేల నుంచి రూ.50 వేలు దక్కించుకున్నాయన్న ఆరోపణలున్నాయి. వాస్తవ వ్యయం కంటే ఎక్కువ కోట్ చేసి టెండర్లు దక్కించుకున్నప్పటికీ.. అధికార యంత్రాంగం చూసీచూడనట్లు ఉందన్న విమర్శలున్నాయి. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పొందుతున్న ఇళ్లకు సౌర విద్యుత్ అందించాలనే లక్ష్యంతో ప్రయోగాత్మకంగా 81 గ్రామాల్లో 40 వేల ఇళ్లకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. అయితే... తొలిదశలో 20 వేల ఇళ్లకు ఈ ప్యానెల్స్‌ను ఏర్పాటు చేసేందుకు టెండర్లు పిలిచారు. అందులో కేంద్రీయభండార్ సంస్థలు, మరో నాలుగు సంస్థలు టెండర్లలో పాల్గొన్నట్లు టీజీ రెడ్కో అధికారులు చెబుతున్నారు. ఇందులో 17,500 ఇళ్లకు సోలార్ ప్యానెల్స్ - మిగతా3లో



## కారణాలు చెప్పకుండా జడ్జిలను నియమిస్తే ఎలా?

- కొలీజియం సిఫార్సులపై జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ఘాటు వ్యాఖ్యలు!
- న్యాయమూర్తుల నియామకాలకు కారణాలు వెల్లడించాలని జస్టిస్ ఉజ్జల్ భుయాన్ వ్యాఖ్యలు
- అనర్హులకు అవకాశం దక్కే ప్రమాదం ఉందని స్పష్టం
- పారదర్శకత, రాజ్యాంగ విలువలు కాపాడాలని సూచన

## మంత్రి విస్తరణ లేనట్టే



**మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న బెర్తుల భర్తీ లేదా రీషఫుల్ చేపడితే..**
**తీవ్ర అసంతృప్తి జ్వాలలు రేగుతాయనే అధిష్ఠానంలో భయం**

- ఎంతోమంది సీనియర్లు, ఎమ్మెల్యేలు ఆశగా ఎదురుచూస్తున్న మంత్రివర్గ విస్తరణ ప్రస్తుతానికి కోల్డ్ స్టోరేజీ లోకి వెళ్లిపోయింది
- పలు విడతలుగా సమావేశమైనప్పటికీ, కేబినెట్ విస్తరణ లేదా మార్పుచేర్పులకు మాత్రం అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు.
- చాన్నాళ్లుగా మంత్రి పదవులపై ఆశలు పెంచుకున్న ఆశావహులకు నిరాశే మిగిలింది
- ఈ నిర్ణయం వెనుక అధిష్ఠానం ఊరుకున్నంత ఉత్తమం.. బోడిగుండంత సుఖం అనే రక్షణాత్మక వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు స్పష్టమవుతోంది

హైదరాబాద్

హైదరాబాద్ నుంచి ఢిల్లీ దాకా తెలంగాణ కాంగ్రెస్ ముఖ్యనేతలు సాగించిన మూడు రోజుల సుదీర్ఘ చర్చలు, ఏఐసీసీ సమన్వయ కమిటీ భేటీల తర్వాత తేలిందేమిటంటే.. ఎంతోమంది సీనియర్లు, ఎమ్మెల్యేలు ఆశగా ఎదురుచూస్తున్న మంత్రివర్గ విస్తరణ ప్రస్తుతానికి కోల్డ్ స్టోరేజీ లోకి వెళ్లిపోయింది. ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క సహా సీనియర్లంతా ఢిల్లీ వేదికగా ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీలతో పలు విడతలుగా సమావేశమైనప్పటికీ, కేబినెట్ విస్తరణ లేదా మార్పుచేర్పులకు మాత్రం అధిష్ఠానం గ్రీన్ సిగ్నల్ ఇవ్వలేదు. దీంతో చాన్నాళ్లుగా మంత్రి పదవులపై ఆశలు పెంచుకున్న ఆశావహులకు నిరాశే మిగిలింది. ఈ నిర్ణయం వెనుక అధిష్ఠానం ఊరుకున్నంత ఉత్తమం.. బోడిగుండంత సుఖం అనే రక్షణాత్మక వ్యూహాన్ని అమలు చేస్తున్నట్లు స్పష్టమవు తోంది. ప్రస్తుతం తెలంగాణ మంత్రివర్గంలో ఖాళీగా ఉన్న బెర్తుల భర్తీ - మిగతా3లో


## భూమిపై కురుస్తున్న అంతరిక్ష చెత్త..

- వారానికి ఒక టన్ను చొప్పున ముప్పు!
- వారానికి టన్ను చొప్పున భూమిపైకి చేరుతున్న అంతరిక్ష శకలాలు
- పెరిగిన రాకెట్ ప్రయోగాలు, ఉపగ్రహాల వల్లే ఈ పరిస్థితి
- ఇళ్లు, పొలాల్లో పడుతున్న రాకెట్ భాగాలతో పెరుగుతున్న ఆందోళన
- శిథిలాల నియంత్రణపై కఠిన అంతర్జాతీయ నిబంధనలు లేకపోవడం ప్రధాన సమస్య
- ప్రస్తుతానికి ప్రమాదం తక్కువే అయినా భవిష్యత్తులో ముప్పు పొంచి ఉందని నిపుణుల హెచ్చరిక



## మైక్రో బ్రూవరీల లైసెన్సులకు ముడుపులు!

- వాటి కోసం సిండికేట్‌లోని ఓ వ్యక్తి పరపతి ఉపయోగించి చక్రం తిప్పాడనే ప్రచారం
- కోట్ల రూపాయలు చేతులు మారాయనే ఆరోపణలు..
- గతంలో వివాదాస్పదమైన అనుమతుల ప్రక్రియ
- దీంతో కొన్నాళ్లు పక్కన పెట్టేసిన ఎక్సైజ్ శాఖ...
- తాజాగా 110 దరఖాస్తుల్లో 23కు అనుమతులు..
- ఏ ప్రాతిపదికన ఇచ్చారన్న దానిపై అస్పష్టత
- ఆ తర్వాత 'అన్నీ చక్కదిద్దుకుని' అనుమతులు మంజూరు



హైదరాబాద్

రాష్ట్రంలో మైక్రో బ్రూవరీలకు ప్రభుత్వం బార్లా తెరిచింది. వివాదాస్పదమైన మైక్రో బ్రూవరీల ఏర్పాటుకు గుట్టుచప్పుడు కాకుండా అనుమతులు ఇచ్చేసింది. ఓఆర్ఆర్ పరిధిలోని కోర్ అర్బన్ రీజియన్ లోనూ, అలాగే మునిసిపల్ కార్పొరేషన్లు కరీంనగర్, నిజామాబాద్, వరంగల్, ఖమ్మం, మహబూబ్‌నగర్ పరిధిలో అనుమతులు ఇచ్చినట్లు సమాచారం. పర్యాటక రంగాన్ని ప్రోత్సహించే పేరిట ఈ అనుమతులు మంజూరు చేయడం వెనుక కోట్ల రూపాయలు చేతులు మారినట్లు ఎక్సైజ్ శాఖలో ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఈ అనుమతుల ప్రక్రియకు అనుసరించిన విధానాన్ని గోప్యంగా ఉంచడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి, ఈ అనుమతుల వెనకాల 'పరపతి' ఉపయోగించిన వారికి అనుమతులు లభించినట్లు - మిగతా3లో



## చట్టపరమైన వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యం

- భావ ప్రకటన స్వేచ్ఛకు ఎలాంటి భంగం సరికాదు
- రెచ్చగొట్టే ప్రసంగాలు, నేరాలను అరికట్టేలా చట్టాన్ని రూపొందించిన ప్రభుత్వం
- బిల్లును మరింత సమగ్రంగా, రాజ్యాంగబద్ధంగా రూపొందించే లక్ష్యంతో ఏర్పాటైన సెలెక్ట్ కమిటీ సమావేశం
- వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యమని వెల్లడి

హైదరాబాద్

కులం, మతం, ప్రాంతం, లింగం పేరుతో విద్వేషాన్ని రెచ్చగొట్టే ప్రసంగాలు, నేరాలను అరికట్టేలా చట్టాన్ని రూపొందించడంపై కమిటీ దృష్టి సారించినట్లు విద్వేషపూరిత నేరాల కమిటీ అధ్యక్షుడు, - మిగతా3లో

## క్షమించడం కాదు.. విద్యార్థులకు మోదీ క్షమాపణలు చెప్పాలి



- బాధిత కుటుంబాలను పరామర్శించని ప్రధాని
- విద్యార్థులను "క్షమించడం" గురించి మాట్లాడే సాహసం చేస్తున్నారని వ్యాఖ్య
- తమిళనాడు పర్యటనలో రాహుల్ గాంధీ వ్యాఖ్యలు
- లీక్ అయిన ప్రశ్నపత్రాలు. రద్దయిన పరీక్షలు. సంవత్సరాల తరబడి చేసిన కృషి రాత్రికి రాత్రే నాశనమైంది



## మధ్యవర్తిత్వం భారత నాగరికతలోనే ఉంది

- వివాదాల పరిష్కారానికి మధ్యవర్తిత్వం భారత సంస్కృతిలో భాగమన్న సీజేఐ సూర్యకాంత్
- జైపూర్‌లో జరిగిన కామన్వెల్త్ మధ్యవర్తిత్వ సదస్సులో కీలక ప్రసంగం
- వేదాలు, రామాయణ, మహాభారతాల్లోనే మధ్యవర్తిత్వ సూత్రాలున్నాయని వెల్లడి



## నీట్ యూజీ 2026: ఆగస్టు 4 నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం

- నీట్ యూజీ 2026 కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను ప్రకటించిన ఎన్టీఏ
- ఆగస్టు 4 నుంచి ఆల్ ఇండియా కోటా కౌన్సెలింగ్ ప్రారంభం
- సెప్టెంబర్ 8 నుంచి అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల తరగతులు
- సెలవుల్లోనూ పనిచేయాలని మెడికల్ కాలేజీలకు ఆదేశాలు

# క్షమించడం కాదు.. విద్యార్థులకు మోదీ క్షమాపణలు చెప్పాలి

ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. దేశంలోని విద్యార్థులకు మోదీ "క్షమాపణలు" చెప్పాలని, అంతేకానీ వారిని "క్షమించడం" కాదని వ్యాఖ్యానించారు. నీట్ పేపర్ లీకేజీలు, పరీక్షల రద్దుల కారణంగా తీవ్ర మనస్తాపానికి గురై బలవన్మరణానికి పాల్పడిన విద్యార్థుల కుటుంబాలను పరామర్శించని ప్రధాని, విద్యార్థులను "క్షమించడం" గురించి మాట్లాడే సాహసం చేస్తున్నారని దుయ్యబట్టారు. తమిళనాడులోని మామల్లపురంలో బాధిత కుటుంబాలతో సమావేశమయ్యారు. అనంతరం ఎక్స్‌లో పోస్ట్‌లో కేంద్రప్రభుత్వంపై, ప్రధాని మోదీపై తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. "కోల్పోయిన ప్రతి చిన్నారి ప్రాణం వెనుక, ఎప్పటికీ వీడని వేదనను మోస్తున్న ఒక కుటుంబం ఉంటుంది. అలాగే, విచ్ఛిన్నమైన విద్యా వ్యవస్థపై తీవ్రమైన ప్రశ్నలు తలెత్తుతాయి. లీక్ అయిన ప్రశ్నపత్రాలు. రద్దయిన పరీక్షలు. సంవత్సరాల తరబడి చేసిన కృషి రాత్రికి రాత్రే నాశనమైంది. విద్యార్థులతో నిజాయతీగా ఉండని వ్యవస్థలో, మన విద్యార్థులను నిజాయతీగా చదవమని చెబుతున్నారు. అయినా, విద్యార్థులను "క్షమించడం" గురించి మాట్లాడేంత ధైర్యం ప్రధానమంత్రికి ఉంది. బిడ్డలను కోల్పోయి దుఃఖిస్తున్న ఒక్క తల్లి, తండ్రిని కూడా మోదీ కలవలేదు. లీక్ అయిన ప్రశ్నపత్రం వల్ల భవిష్యత్తు నాశనమైన ఒక్క విద్యార్థితో కూడా ఆయన కూర్చోని మాట్లాడలేదు."



మరోవైపు, తన సందేశంలో యువ నిరసనకారులు ఉపయోగించిన భాషపైనే మోదీ దృష్టి సారించారని, కానీ నిరసనకారుల పట్ల ప్రభుత్వం, పోలీసుల వ్యవహారశైలిని ప్రస్తావించడంలో విఫలమయ్యారని వామపక్ష విద్యార్థి సంఘం ఐసా పేర్కొంది. తమ హక్కుల కోసం పోరాటం చేస్తున్న నిరసనకారులపై లాఠీలు, పెల్లెట్లు, బుల్లెట్లు ప్రయోగించడం, అలాగే అసమ్మతివాదులపై ఆన్‌లైన్ ట్రోలింగ్, డాక్సింగ్, బెదిరింపులే "అసలైన సాంస్కృతిక షాక్" అని అది ఆరోపించింది.

ఇదిలా ఉండగా, సామాజిక మాధ్యమాల వేదికగా ప్రధాని మోదీ శుక్రవారం మరో వీడియో పోస్ట్ చేశారు. అందులో ఇటీవల దిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ఏం జరిగిందో భారత్‌తోపాటు ప్రపంచ దేశాలన్నీ చూశాయని, కొంతమంది ఆకతాయి యువత దుర్భాషలాడటం, అసభ్యకరమైన పదాలు వాడటం, తనను, తన దివంగతురాలైన మాతృమూర్తిని కూడా దూషించారని పేర్కొన్నారు. అయితే, యవ్వనంలో ఇటువంటి తప్పులు సహజమని, దారి తప్పినవారిని సరైన మార్గంలో నడిపించడం మన కర్తవ్యమని మోదీ తెలిపారు. తనపై దుర్భాషలాడిన వాళ్లను శిక్షించడం, కోర్టు చుట్టు తిప్పడం వంటివాటితో పరిస్థితిలో మార్పు రాదని, అలా చేసిన వారిని క్షమిస్తున్నట్లు ఒక సందేశాన్ని పోస్టు చేశారు. తప్పుల నుంచి నేర్చుకుని ముందుకెళ్లాలని, దేశాభివృద్ధిలో కలిసి రావాలని యువతకు సూచించారు.

కాగా, దిల్లీ విద్యార్థుల నిరసన కార్యక్రమంలో మోదీపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో కేసు నమోదైన బాలికకు సంబంధించిన క్షమాపణ వీడియో ఒకటి వైరల్‌గా అయ్యింది. తన వ్యాఖ్యలపై తీవ్ర పశ్చాత్తాపం వ్యక్తం చేస్తూ దేశ ప్రజలకు క్షమాపణ కోరింది. చేతులు జోడించి కనిపించిన ఆమె, నిరసన కార్యక్రమంలో కొందరి ప్రభావానికి లోనై ప్రధానిపై తీవ్ర వ్యాఖ్యలు చేశానని పేర్కొంది. నిరసన సమయంలో కొంతమంది చెప్పిన మాటలకు ప్రభావితమై ప్రధానమంత్రి గురించి చాలా తప్పుగా మాట్లాడానని తెలిపింది. తాను చేసిన పని క్షమించరానిదని, తన వల్ల పెద్ద తప్పు జరిగిందని ఆవేదన వ్యక్తం చేసింది. అయితే, అదే తన జీవితంలో మొదటి, చివరి తప్పు అని ఆమె స్పష్టం చేసింది. అలాగే, దేశ ప్రజలందరికీ చేతులు జోడించి క్షమాపణ కోరుతున్నానని, తాను చేసిన పనికి చాలా సిగ్గుగా ఉందని,ఆ బాలిక వీడియోలో విజ్ఞప్తి చేసింది.

# కారణాలు చెప్పకుండా జడ్జిలను నియమిస్తే ఎలా?

న్యాయమూర్తుల నియామక ప్రక్రియలో అత్యంత పారదర్శకత తప్పనిసరి అని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ అభిప్రాయపడ్డారు. కొలీజియం చేసే సిఫారసులకు తగిన కారణాలు వెల్లడించకపోవడం వల్ల అర్హత కలిగిన జడ్జిల సేవలకు తగిన గుర్తింపు లభించకపోవడమే కాకుండా అన్యాయం జరుగుతుందని అన్నారు. ఇంకా రాజ్యాంగ విలువలకు విరుద్ధంగా వ్యవహరించే శక్తులు కూడా న్యాయవ్యవస్థలోకి ప్రవేశించే అవకాశం ఏర్పడుతుందని ఆయన తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. లీగల్ థింక్ టాంక్ 'విధి'కి చెందిన జీూాణ× ఇనిషియేటివ్ రూపొందించిన ఒక రిపోర్ట్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న జస్టిస్ భుయాన్ అక్కడ జరిగిన ఒక చర్చలో కొలీజియం శైలిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇటీవల మూడు కొలీజియం తీర్మానాల్లో న్యాయమూర్తుల పదోన్నతులు, నియామకాలకు సంబంధించి కారణాల్ని వెల్లడించలేదని అన్నారు.

"గడిచిన 3 కొలీజియాల తీర్మానాలను నేను నిశితంగా గమనించా. అందులో నియామకాలకు సంబంధించి ఎలాంటి కారణాలూ వెల్లడించలేదు. ఇది పారదర్శకత సూత్రం నుంచి వెనక్కి తగ్గడం కాదా? కొలీజియం తీర్మానాలు ఇప్పుడు చూస్తుంటే ఒకే మూస పద్ధతిలో, కాపీ-పేస్ట్ చేసినట్లుగా కనిపిస్తున్నాయి."

**రాజ్యాంగ విరుద్ధ వ్యాఖ్యలు చేసే వారికే చోటు!**

కారణాలు చెప్పకుండా రహస్యంగా నియామకాలు చేపట్టడం వల్ల అనర్హులు లేదా వివాదాస్పద వ్యాఖ్యలు చేసే వ్యక్తులు న్యాయమూర్తులుగా ఎంపికయ్యే ప్రమాదం ఉందని జస్టిస్ భుయాన్ హెచ్చరించారు. గతంలో ఒక హైకోర్టు మాజీ న్యాయమూర్తి ఒక వర్గం ప్రజల్ని ఉద్దేశించి 'చీమలు' అన్నారని, మరొకరు వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఉదంతాల్ని ఆయన పరోక్షంగా ప్రస్తావించారు.

**'ఎవరిని ఎందుకు సిఫార్సు చేస్తున్నామో తెలియాలి'**

కారణాలు దాచడం ద్వారా కొలీజియం అద్భుతంగా పనిచేసే నిజాయతీ గల జడ్జిలకు ద్రోహం చేయడమే కాకుండా, న్యాయ వ్యవస్థలోకి అనుచిత వ్యక్తులు వచ్చేందుకు స్థానం కల్పిస్తోంది. అటువంటి వారు రేపటి రోజున వ్యవస్థలోకి వచ్చి ఒక వర్గం ప్రజల్ని చీమలు అని సంబోధిస్తూ రాజ్యాంగ విలువలకు పూర్తి విరుద్ధమైన వ్యాఖ్యలు చేసే అవకాశం ఉంది' అని జస్టిస్ ఉజ్జల్ భుయాన్ ఉదహరించారు.



న్యాయవ్యవస్థలోకి అలాంటి వ్యక్తులు రాకుండా అడ్డుకోవాలంటే, ఎవరిని ఎందుకు ఎంపిక చేస్తున్నామో, ఎందుకు తిరస్కరిస్తున్నామో తెలిపేలా సరైన చర్చలు జరగాలని, కారణాల్ని కూడా బహిరంగంగా వెల్లడించాలని ఆయన డిమాండ్ చేశారు. గతంలో కనీసం సిఫార్సులకు కారణాలైనా వెల్లడించేవారని, ఇప్పుడు ఆ సంప్రదాయం అసలు కనిపించడం లేదని వ్యాఖ్యానించారు. ఇక్కడ జస్టిస్ ఉజ్జల్ భుయాన్ నేరుగా ఎవరి పేరునూ ప్రస్తావించలేదు. అయితే 2024లో విశ్వ హిందూ పరిషత్ కార్యక్రమంలో పాల్గొన్న అలహాబాద్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి చేసిన వివాదాస్పద వ్యాఖ్యల్ని ఆయన పరోక్షంగా ప్రస్తావించినట్లు భావిస్తున్నారు. అప్పుడు ఆ జడ్జి 'మన సంస్కృతిలో చిన్న చిన్న జంతువులకు కూడా హాని చేయకూడదని, చీమలను కూడా చంపకూడదని నేర్పుతారు. ఇది మనలో బలంగా నాటుకుపోయింది. కానీ మీ సంస్కృతిలో చిన్నప్పటి నుంచే జంతువుల వధను చూస్తారు. మీలో సహనం, కరుణ ఎలా ఆశించగలం' అంటూ వ్యాఖ్యానించగా, దీనిపై అప్పట్లో ప్రతిపక్ష పార్టీలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తూ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి.

**వివాదాలకు దారితీస్తున్న వ్యాఖ్యలు**

మరోవైపు ఇటీవల భారత ప్రధాన న్యాయమూర్తి (జజీ×) జస్టిస్ సూర్యకాంత్ కూడా ఒక సందర్భంలో కొందరిని 'కాక్రోచ్ (బొద్దింకలు)' అని వర్ణించడం వివాదాస్పదమైంది. దానికి నిరసనగా సోషల్ మీడియాలో 'కాక్రోచ్ జనతా పార్టీ' పేరుతో చీజుజు (నీట్ పరీక్ష) పేపర్ లీక్ అంశంపై పెద్ద ఎత్తున విద్యార్థుల నిరసన ఉద్యమం కూడా చెలరేగింది. ఈ క్రమంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామా కూడా చేశారు. అయితే కొలీజియం వ్యవస్థలపై వచ్చే విమర్శలపై సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ గతంలో స్పందిస్తూ స్పష్టత ఇచ్చారు. సుప్రీం కోర్టుకు లేదా హైకోర్టులకు న్యాయమూర్తుల్ని సిఫార్సు చేసే సమయంలో వారి పనితీరు, న్యాయమూర్తిగా అందించిన సుదీర్ఘ సేవలు, గతంలో వారు నిర్వహించిన బాధ్యతల్ని, వృత్తిపరమైన అనుభవం వంటి అనేక అంశాల్ని పరిశీలించిన తర్వాతే కొలీజియం తుది నిర్ణయం తీసుకుంటుందని ఆయన వివరించారు.

# ఇథనాల్ కలపకపోతే పెట్రోల్ ధర
# లీటరుకు రూ.125 అయ్యేది!

అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు విపరీతంగా పెరిగినప్పటికీ దేశంలో పెట్రోల్ ధరలు అదుపులో ఉండేందుకు ఇథనాల్ బ్లెండెడ్ పెట్రోల్ (జుధీూ) కార్యక్రమమే ప్రధాన కారణమని కేంద్రం స్పష్టం చేసింది. ఇథనాల్ మిశ్రమం అమలు చేయకపోయి ఉంటే దేశ రాజధాని దిల్లీలో పెట్రోల్ ధర లీటరుకు ఏకంగా రూ. 125 కు చేరేదని కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు మంత్రిత్వ శాఖ పేర్కొంది. మంత్రిత్వ శాఖ విడుదల చేసిన ప్రకటన ప్రకారం, భారత క్రూడ్ బాస్కెట్ ధర బ్యారెల్‌కు 135 డాలర్ల వరకు పెరిగిన సమయంలో కూడా దిల్లీలో వినియోగదారులు లీటర్ పెట్రోల్‌కు రూ. 94.77 మాత్రమే చెల్లించారు.

**ప్రజలకు లీటరుకు రూ. 30 వరకు ఆదా!**

ప్రతి లీటర్ పెట్రోల్‌లో 20 శాతం వరకు దేశీయంగా ఉత్పత్తి చేసిన ఇథనాల్‌ను కాస్త తక్కువ ధరలకు, ముందస్తుగా నిర్ణయించిన ధరలకే కొనుగోలు చేయడం వల్ల అంతర్జాతీయ చమురు ధరల పెరుగుదల ప్రభావం తగ్గిందని పెట్రోలియం శాఖ వివరించింది. దీంతో ఆ సంక్షోభ సమయంలో కూడా వినియోగదారులకు లీటరుపైనే దాదాపుగా రూ. 30 వరకు ఆదా అయినట్లు తెలిపింది. ఇథనాల్ బ్లెండింగ్ లక్ష్యం రోజూ చౌకైన ఇంధనం అందించడం కాదని, ప్రపంచ చమురు మార్కెట్లో ఏర్పడే తీవ్రమైన ధరల ఒడుదొడుకుల నుంచి భారత వినియోగదారుల్ని రక్షించడం, దేశ ఇంధన భద్రతను మరింత బలోపేత[redacted]చేసేందుకు దోహదం చేయడమే ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేసింది.

ఇథనాల్ బ్లెండింగ్ కార్యక్రమం వల్ల ఇప్పటివరకు సుమారు రూ. 1.97 లక్షల కోట్లకుపైగా విదేశీ మారకద్రవ్యం ఆదా




అయిందని కేంద్రం గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. ఇంకా 316 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా ముడి చమురు దిగుమతులకు ప్రత్యామ్నాయం లభించింది. ఇదే సమయంలో 950 లక్షల మెట్రిక్ టన్నులకుపైగా కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలు తగ్గినట్లు తెలిసింది.

**పన్ను చెల్లింపుదారుల డబ్బు కాదు- ఇదో ఎనర్జీ ఇన్సూరెన్స్!**

మరోవైపు ఇథనాల్ బ్లెండింగ్ పథకం టాక్స్ పేయర్ల సబ్సిడీలపై నడుస్తుందనే విమర్శల్ని కూడా కేంద్ర ప్రభుత్వం ఖండించింది. ఇది పన్ను చెల్లింపుదారుల డబ్బుతో నడిచే సబ్సిడీ కాదని, దేశ ఇంధన భద్రతకు రక్షణ కవచంలా పనిచేసే వ్యూహాత్మక కార్యక్రమం అని, ఎనర్జీ ఇన్సూరెన్స్ వంటిదని వెల్లడించింది. 'ఇది పన్నుల డబ్బుతో నడిచే సబ్సిడీ కానే కాదు. భారత ఇంధన భద్రతకు ఒక [redacted] బీమా (ఎనర్జీ ఇన్సూరెన్స్) వంటిది. అంతర్జాతీయంగా తీవ్ర చమురు సంక్షోభం వచ్చినప్పుడు ఈ విధానం దేశాన్ని ఎలా కాపాడిందో ఇప్పటికే నిరూపితమైంది' అని తెలిపింది.

**తగ్గనున్న చమురు దిగుమతులు**

అంతేకాకుండా ఈ కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు రైతులు, డిస్టిలరీలకు రూ. 1.66 లక్షల కోట్లకుపైగా చెల్లింపులు (డైరెక్ట్ పేమెంట్స్) జరిగాయని కేంద్రం వెల్లడించింది. దీంతో వ్యవసాయ ఉత్పత్తులకు స్థిరమైన మార్కెట్ ఏర్పడుతుందని ఆశాభావం వ్యక్తం చేసింది. ఇంకా ప్రస్తుతం సుమారు 88 శాతంగా ఉన్న దేశ చమురు దిగుమతులపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గించడంలో ఇథనాల్ బ్లెండింగ్ కీలక పాత్ర పోషిస్తుందని మంత్రిత్వ శాఖ పేర్కొంది. అలాగే ప్రపంచ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు ఒక్కసారిగా పెరిగినా దేశీయంగా ఇంధన ధరల్ని నియంత్రించేందుకు ఈ కార్యక్రమం కీలకంగా ఉపయోగపడుతుందని తెలిపింది.

ఇటీవల పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితులు చమురు విషయంలో దిగుమతులపైనే అధికంగా ఆధారపడే భారత్ వంటి పలు దేశాల్ని ఎలాంటి ఇబ్బందులకు గురిచేశాయో తెలిసిందే. ఇరాన్- అమెరికా యుద్ధం సమయంలో 2 నెలల కిందట ఒక దశలో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 126 డాలర్ల వరకు పెరిగింది. అప్పుడు దేశీయంగా కూడా చమురు సంస్థలు చాలా కాలం తర్వాత పెట్రోల్, డీజిల్ ధరల్ని 2-3 దఫాల్లో లీటరుపై రూ. 7 వరకు పెంచేశాయి. తర్వాత ఇంటర్నేషనల్ మార్కెట్లో ముడి చమురు ధర తగ్గి ప్రస్తుతం 88 డాలర్లకు దిగొచ్చినా దేశీయంగా రిటైల్ ధరల్ని మళ్లీ తగ్గించలేదు. దిల్లీలో ప్రస్తుతం లీటర్ పెట్రోల్ ధర రూ. 102.12 గా ఉండగా, డీజిల్ ధర రూ. 95.20 గా ఉంది. హైదరాబాద్ మార్కెట్లో పెట్రోల్, డీజిల్ రేట్లు లీటరుపై వరుసగా రూ. 115.73, రూ. 103.82 గా ఉన్నాయి.

## భూమిపై కురుస్తున్న అంతరిక్ష చెత్త..

అంతరిక్ష రంగంలో ప్రయోగాలు వేగవంతం అవుతున్న కొద్దీ, భూమికి కొత్త ముప్పు పొంచి ఉంది. ప్రతి వారం సుమారు ఒక మెట్రిక్ టన్ను (1000 కిలోలు) బరువున్న అంతరిక్ష శకలాల వర్షం భూమిపై కురుస్తోందని తాజా నివేదికలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. పెరిగిపోతున్న రాకెట్ ప్రయోగాలు, వేల సంఖ్యలో కక్ష్యలో పరిభ్రమిస్తున్న ఉపగ్రహాల కారణంగా ఈ సమస్య రోజురోజుకు తీవ్రమవుతోంది. పోలెండ్ అంతరిక్ష సంస్థకు చెందిన నిపుణుడు మారియస్ స్లోనినా వెల్లడించిన వివరాల ప్రకారం, దాదాపు ప్రతిరోజూ అంతరిక్షం నుంచి ఏదో ఒక వస్తువు భూ వాతావరణంలోకి ప్రవేశిస్తోంది. ఇలా వారానికి సగటున ఒక టన్ను శకలాల చొప్పున భూమిని చేరుతున్నాయి. అమెరికా స్పేస్ ఫోర్స్ గణాంకాలు ఈ పెరుగుదలను స్పష్టంగా చూపుతున్నాయి. దశాబ్దం క్రితం ఏడాదికి సుమారు 110 వస్తువుల పునఃప్రవేశంపై హెచ్చరికలు జారీ చేస్తే, 2025 నాటికి ఆ సంఖ్య 820కి పెరిగింది. గత ఏడాది ప్రపంచవ్యాప్తంగా 300కి పైగా రాకెట్ ప్రయోగాలు జరగడమే ఇందుకు నిదర్శనం. సాధారణంగా అంతరిక్ష శిథిలాల్లో అధిక భాగం భూ వాతావరణంలోకి ప్రవేశించగానే ఘర్షణకు గురై మండిపోతాయి. మిగిలినవి సముద్రాల్లో పడిపోతాయి. అయితే, కొన్నిసార్లు పెద్ద పరిమాణంలో ఉండే భాగాలు పూర్తిగా కాలిపోకుండా భూమిపై పడుతున్నాయి. ఇటీవల ఇలాంటి ఘటనలు తరచూ వెలుగులోకి వస్తున్నాయి. కెన్యాలోని ముకుకు గ్రామంలో ఒక వ్యవసాయ క్షేత్రంలో 16 ఏళ్ల క్రితం ప్రయోగించిన రాకెట్‌కు చెందిన భారీ లోహపు రింగ్ ఒకటి కూలిపోయింది. అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం నుంచి విడివడిన ఒక శిథిలం అమెరికాలోని ఫ్లోరిడాలో ఒక ఇంటిపై పడింది. పోలెండ్‌లో స్పేస్‌ఎక్స్ రాకెట్‌కు చెందిన భాగాలు, స్పెయిన్‌లోని కానరీ దీవుల్లో చైనాకు చెందిన పాత ఉపగ్రహ శకలాలు, ఆస్ట్రేలియా, ఫిలిప్పీన్స్‌లోనూ ఇలాంటి ఘటనలు నమోదయ్యాయి. అంతరిక్ష శిథిలాల వల్ల ఒక వ్యక్తి గాయపడే అవకాశం, పిడుగు పడే సంభావ్యత కంటే చాలా తక్కువ అని నిపుణులు చెబుతున్నప్పటికీ, ఈ ప్రమాదం క్రమంగా పెరుగుతోందని హెచ్చరిస్తున్నారు. 2035 నాటికి కేవలం స్పేస్‌ఎక్స్ ఉపగ్రహాల శిథిలాల వల్ల ప్రతి రెండేళ్లకు ఒకరు గాయపడటం లేదా ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని అమెరికా ఫెడరల్ ఏవియేషన్ అడ్మినిస్ట్రేషన్ అధ్యయనం అంచనా వేసింది. ఈ ముప్పును నియంత్రించడానికి స్పష్టమైన అంతర్జాతీయ నిబంధనలు లేకపోవడం ప్రధాన సమస్యగా మారింది. ప్రచ్ఛన్న యుద్ధ కాలంలో రూపొందించిన ఐక్యరాజ్యసమితి ఒప్పందాలు నేటి పరిస్థితులకు సరిపోవడం లేదు. 2007లో జారీ చేసిన మార్గదర్శకాలకు చట్టబద్ధత లేదు. అనియంత్రిత శిథిలాలు ఎక్కడ పడతాయో కచ్చితంగా అంచనా వేయడం కూడా చాలా కష్టం. కేవలం ఒక్క నిమిషం అంచనా తప్పినా, శిథిలాలు పడే ప్రదేశం దాదాపు 300 మైళ్ల వరకు మారే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో, శిథిలాలు పూర్తిగా కాలిపోయేలా వస్తువులను రూపొందించాలని నిపుణులు సూచిస్తున్నా, దానిని తప్పనిసరి చేసే చట్టాలు లేవు. సాంకేతికత వేగంగా ముందుకు వెళ్తున్నా, దానివల్ల తలెత్తే పర్యవసానాలను ఎదుర్కోవడానికి అవసరమైన నియంత్రణ వ్యవస్థలు వెనుకబడి ఉండటం ఆందోళన కలిగిస్తోంది.

## నీట్ యూజీ 2026:
## ఆగస్టు 4 నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం



నీట్ యూజీ-2026 కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీఏ) శనివారం ప్రకటించింది. దీని ప్రకారం, ఆల్ ఇండియా కోటా సీట్ల భర్తీకి ఆగస్టు 4 నుంచి కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం కానుంది. అండర్ గ్రాడ్యుయేట్ మెడికల్ కోర్సుల విద్యా సంవత్సరం (అకడమిక్ సెషన్) సెప్టెంబర్ 8 నుంచి మొదలవుతుందని స్పష్టం చేసింది. తొలి రౌండ్‌లో ఆల్ ఇండియా కోటా, డీమ్డ్, సెంట్రల్ యూనివర్సిటీల కౌన్సెలింగ్ ఆగస్టు 4 నుంచి 17 వరకు జరుగుతుంది. ఈ రౌండ్‌లో సీట్లు పొందిన అభ్యర్థులు ఆగస్టు 22వ తేదీలోగా సంబంధిత కళాశాలల్లో చేరాల్సి ఉంటుంది. ఆగస్టు 23న వెరిఫికేషన్ ప్రక్రియ ఉంటుంది. ఇక రాష్ట్రాల కోటా మొదటి రౌండ్ కౌన్సెలింగ్ ఆగస్టు 13 నుంచి 22 వరకు నిర్వహిస్తారు. రెండో రౌండ్ కౌన్సిలింగ్ విషయానికి వస్తే, ఆల్ ఇండియా కోటా ప్రక్రియ ఆగస్టు 24 నుంచి సెప్టెంబర్ 2 వరకు, రాష్ట్రాల కోటా కౌన్సెలింగ్ ఆగస్టు 31 నుంచి సెప్టెంబర్ 8 వరకు కొనసాగుతుంది. నిర్దేశిత షెడ్యూల్‌ను సకాలంలో పూర్తి చేసేలా శని, ఆదివారాలు మరియు ఇతర సెలవు దినాల్లోనూ పనిచేయాలని అన్ని మెడికల్ కాలేజీలను ఎన్టీఏ ఆదేశించింది. తదుపరి రౌండ్లు, స్టేట్ వేకెన్సీలతో కలిపి అక్టోబర్ 10 నాటికి ప్రవేశాల ప్రక్రియను సంపూర్ణంగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. నీట్ పరీక్షలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో మే 3న జరిగిన పరీక్షను రద్దు చేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత ప్రభుత్వం 47 మంది ఎన్టీఏ అధికారులను విధుల నుంచి తొలగించి, చట్టపరమైన చర్యలు చేపట్టింది. అనంతరం నిర్వహించిన రీ-టెస్ట్ ఫలితాలను జులై 16న ప్రకటించారు. ఈ క్రమంలోనే తాజాగా కౌన్సెలింగ్ షెడ్యూల్ విడుదలైంది.

## మధ్యవర్తిత్వం భారత నాగరికతలోనే ఉంది




వివాదాలను పరస్పర అంగీకారంతో, మధ్యవర్తిత్వం ద్వారా పరిష్కరించుకోవడం భారతీయ నాగరికతలో అంతర్భాగమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్ అభిప్రాయపడ్డారు. జైపూర్‌లో నిర్వహిస్తున్న కామన్వెల్త్ మధ్యవర్తిత్వ సదస్సు రెండో రోజైన శనివారం ఆయన ప్రసంగించారు. 2023లో మధ్యవర్తిత్వ చట్టం అమల్లోకి రాకముందు నుంచే మన సంస్కృతిలో ఈ విధానం ప్రాచుర్యంలో ఉందని ఆయన స్పష్టం చేశారు. ఇటీవలి కాలంలో శాసన, న్యాయవ్యవస్థలు ఈ పద్ధతిని మరింత బలోపేతం చేశాయని తెలిపారు. ఈ సందర్భంగా ఒక నారింజ పండు కోసం వివాదానికి దిగిన ఇద్దరు సోదరీమణుల కథను ఆయన ఉదాహరణగా పేర్కొన్నారు. ఒకరికి పండు గుజ్జు, మరొకరికి తొక్క అవసరమైనప్పటికీ, ఆ విషయం స్పష్టంగా మాట్లాడుకోకపోవడంతో వారు పండును చెరిసగం పంచుకున్నారని, ముందే తమ అవసరాల గురించి చర్చించుకుని ఉంటే ఇద్దరికీ పూర్తిస్థాయిలో ప్రయోజనం చేకూరేదని వివరించారు. మన ప్రాచీన గ్రంథాలైన వేదాలు, రామాయణం, మహాభారతాల్లోనూ మధ్యవర్తిత్వానికి సంబంధించిన అనేక అంశాలు ఉన్నాయని ఆయన గుర్తుచేశారు. కౌటిల్యుడి అర్థశాస్త్రంలో పేర్కొన్న సామ, దాన, భేద, దండోపాయం అనే నాలుగు పాలనా పద్ధతుల్లో మొదటిదైన 'సామ' నుంచే ఆధునిక మధ్యవర్తిత్వం ఉద్భవించిందని విశ్లేషించారు. భారతీయ సంప్రదాయంలో వివాద పరిష్కారానికి తొలుత కుటుంబం (కుల), తర్వాత వర్గం (శ్రేణి), ఆపై సభ (పుగ) వద్దకు వెళ్లేవారని, ఇవన్నీ విఫలమైనప్పుడే రాజును ఆశ్రయించేవారని తెలిపారు. అంటే ఏ సమస్యకైనా మొదటి అడుగు ఎప్పుడూ సంప్రదింపులేనని ఆయన వివరించారు. ఇరుపక్షాల మధ్య స్నేహపూర్వక పరిష్కారం కుదర్చడమే తన న్యాయవాద వృత్తిలో అత్యంత సంతృప్తినిచ్చిన అనుభవమని మహాత్మా గాంధీ చెప్పిన మాటలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. మధ్యవర్తిత్వం అనేది చట్టబద్ధం కావడానికి ముందే భారతీయుల రక్తంలో ప్రవహిస్తోందని, అది మన సంస్కృతిలో విడదీయరాని భాగమని జస్టిస్ సూర్యకాంత్ తన ప్రసంగంలో వివరించారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
ఆదివారం
2 ఆగస్టు 2026

# మైక్రో బ్రూవరీల లైసెన్సులకు ముడుపులు!

-మొదటిపేజీ తరువాయి

చెబుతున్నారు. ఓ కీలక మంత్రికి సన్నిహితుడిగా చెప్పుకునే వ్యక్తి ఈ వ్యవహారంలో చక్రం తిప్పినట్లు ప్రచారం జరుగుతోంది. ఒక్కో మైక్రోబ్రూవరీ లైసెన్స్ మంజూరుకు రూ.1.5 నుంచి 2 కోట్ల మేరకు ముడుపులు చేతులు మారినట్లు ప్రచారం జరుగుతోంది, ఈ బ్రూవరీలకు ముఖ్యులు కూడా ఓకే చెప్పడంతో దరఖాస్తులకు మోక్షం లభించినట్లు చెబుతున్నారు. దరఖాస్తుదారులు సిండికేట్‌గా ఏర్పడినందునే అనుమతులు సాధ్యమయ్యాయని మంజూరు చేసిన వర్గాలే చెపుతుండటం గమనార్హం. రాష్ట్రంలో ఇప్పటికే ఎక్సైజ్ ఆదాయం ఏటా 23 వేల కోట్ల రూపాయలుంది. దాన్ని ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ, 27,668 కోట్లకు పెంచేలా బడ్జెట్‌లోనే ప్రభుత్వం ప్రతిపాదించింది. ఇప్పుడు ఈ మైక్రో బ్రూవరీలతో ఓ మాదిరి హోటల్‌లోనూ బీరు అందుబాటులోకి రానుంది. ఇప్పటికే పబ్‌లు, వైన్స్ షాప్‌లతో మందు విచ్చల విడిగా అందుబాటులో ఉన్నప్పుడు ఇప్పుడు మైక్రో బ్రూవరీలతో మరింతగా అందుబాటులోకి తీసుకుని రావడంపై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి.



### కొన్నాళ్లు వేచిచూసే ధోరణి...

వాస్తవానికి, గత ఏడాది ఆగస్టులో రాష్ట్రంలో మైక్రో బ్రూవరీల ఏర్పాటుకు నోటిఫికేషన్ విడుదలైంది. ఈమేరకు రోజుకు 1000 లీటర్ల డ్రాట్ బీర్ తయారు చేసుకుని అమ్ముకునేందుకు వీలుగా లైసెన్సులు ఇచ్చేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. మొత్తం 110 దరఖాస్తులు రాగా, జనవరి నాటికే ఎవరెవరికి అనుమతులు ఇవ్వాలనే దానిపై ప్రభుత్వ వర్గాలు ఓ నిర్ణయానికి వచ్చాయి. కానీ, ఈ మైక్రో బ్రూవరీల అనుమతుల్లో కోట్ల రూపాయలు చేతులు మారాయని, ప్రభుత్వంలో ముఖ్యులకు వాటాల పంపిణీ జరిగిందని ప్రధాన ప్రతిపక్షం ఆరోపణలు చేసిన సంగతి విదితమే.

110 దరఖాస్తుల్లో 23 దరఖాస్తులను ఏ ప్రాతిపదికన ఎంపిక చేశారనే విధానాన్ని బహిరంగపరచకపోవడం వల్ల మధ్యవర్తుల ప్రమేయం, అక్రమాలు జరిగాయనే అనుమానాలకు మరింత తావిస్తోంది. మిగిలిన దరఖాస్తులను తిరస్కరించారా? లేక మున్ముందు వాటికి కూడా అనుమతులు మంజూరు చేస్తారా? అన్న అంశంపై ఎక్సైజ్ శాఖ వర్గాలు స్పష్టతనివ్వడం లేదు. ముడుపుల ఆరోపణలను ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అప్పట్లో ఖండించారు. అసలు అనుమతుల మంజూరు జరగనప్పుడు అక్రమాలు ఎక్కడివని ప్రశ్నించిన ఆయన ఇంకా దరఖాస్తుల పరిశీలన ప్రక్రియే కొనసాగుతుందని వెల్లడించారు.


ఈ నేపథ్యంలో కొన్నాళ్లు ఈ మైక్రో బ్రూవరీల ఫైలును ప్రభుత్వం పక్కన పెట్టిందనే చర్చ ఎక్సైజ్ శాఖ వర్గాల్లో జరిగింది. కానీ, తెరవెనుక మళ్లీ సిండికేట్ కీలక పాత్ర పోషించడం, అన్నీ చక్కదిద్దడంతో ఫైలు ముందుకు కదిలిందని సమాచారం. మొత్తంమీద మైక్రో బ్రూవరీల పేరుతో 180 రోజుల్లో ఏర్పాటు చేసుకునేందుకుగాను 23 దరఖాస్తులను ఆమోదించగా, అందులో ఇప్పటికే సిద్ధంగా నాలుగు సంస్థలకు లైసెన్సులు జారీ చేసేందుకూ ఎక్సైజ్ శాఖ రంగం సిద్ధం చేసింది.

### మరింత బార్లా తెరవడమేనా?

హైదరాబాద్ వంటి అంతర్జాతీయ నగరాల్లో పర్యాటకరంగం, ఐటీ రంగాన్ని ఆకర్షించడానికి; గ్లోబల్ కల్చర్‌కు అనుగుణంగా ఆహార--పానీయ సంస్కృతిని అందించడమే లక్ష్యంగా ఈ మైక్రో బ్రూవరీల ఏర్పాటుకు అనుమతినిస్తున్నట్లు ప్రభు త్వం చెబుతోంది. అయితే ఈ డ్రాట్ బీర్ ను బాటిల్స్‌లో సరఫరా చేయకుండా.. ఆ హోటళ్లలో అక్కడే కూర్చుని సేవిస్తారని అధికారవర్గాలు చెబుతున్నాయి. కానీ విమర్శకులు మాత్రం లైసెన్స్ సంఖ్య పెంచడం వల్ల నగరంలో మద్యం విక్రయాలు పెరగడమేకాక.. మరింతగా అందుబాటులోకి వస్తుందని విమర్శకులు పేర్కొంటున్నారు.

# ఉప్పల్ నల్లచెరువు మనసు నిండే చెరువు

హైడ్రా పునరుద్ధరించిన ఉప్పల్ నల్ల చెరువు జలకళను సంతరించుకుంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఉప్పల్ నల్లచెరువు వరద నీరుతో నిండింది. భారీ మొత్తంలో ప్లాస్టిక్ వ్యర్థాలతో నిండి మురికి కూపంగా మారిన ఈ చెరువును రూ.20 కోట్లతో హైడ్రా పునరుద్ధరిస్తోంది. ఈ క్రమంలో వర్షాలు పడినప్పుడు వరద నీరు చెరువులోకి చేరేలా, మురుగు నీరు బయటకు పోయేలా కాలువలను హైడ్రా అభివృద్ధి చేసింది. దీంతో ఎగువనున్న ప్రాంతాలు నీట మునగకుండా వరద నీరు నల్ల చెరువుకు చేరింది. 10 ఎకరాల ఆక్రమణలను తొలగించి 70 ఎకరాల విస్తీర్ణంలో నల్లచెరువును హైడ్రా సర్వాంగసుందరంగా తీర్చిదిద్దుతోంది.



### చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్

ఉప్పల్ నల్లచెరువుకు ఎగువన ఉన్న నాచారం చెరువుతో పాటు పరిసర ప్రాంతాల నుంచి వరద నీరు వచ్చి చేరేలా రెండు ఇన్ లెట్లను అభివృద్ధి చేశారు. చెరువు నిండిన తర్వాత వరద నీరు సాఫీగా మూసీకి చేరేలా ఔట్ లెట్లను నిర్మించారు. నీటి నిల్వకే పరిమితం కాకుండా ప్రజలకు విశ్రాంతి, ఆరోగ్యం, వినోదం కల్పించేలా చెరువు చుట్టూ వాకింగ్ ట్రాక్, పటిష్టమైన మెయిన్ బండ్, పిల్లల కోసం ప్లే ఏరియా, ఓపెన్ జిమ్ వంటి సదుపాయాలను ఏర్పాటు చేస్తున్నారు.

కుటుంబాలతో కలిసి ప్రశాంతంగా గడిపేలా ఆహ్లాదకరమైన ప్రదేశంగా ఉప్పల్ నల్లచెరువును తీర్చిదిద్దుతున్నారు. హైడ్రా తొలి దశలో అభివృద్ధి చేస్తున్న ముఖ్యమైన చెరువుల్లో ఉప్పల్ నల్లచెరువు ఒకటి. ఇప్పటికే మూడు చెరువులు ప్రజలకు అందుబాటులోకి తీసుకురాగా ఉప్పల్ నల్లచెరువును కూడా త్వరలోనే ప్రారంభించనున్నట్లు హైడ్రా తెలిపింది.

### హైడ్రాకు సీఎం అభినందనలు

ఉప్పల్ నల్ల చెరువుకు మళ్లీ జలకళ రావడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతోషం వ్యక్తం చేశారు. ఎక్స్‌లో హైడ్రా పోస్టు చేసిన ఉప్పల్ నల్ల చెరువు విజువల్స్‌పై స్పందించిన సీఎం చెరువుల పునరుజ్జీవంతో రూపురేఖలు మారుతున్న హైదరాబాద్‌ను చూడటం తనకెంతో సంతృప్తిని ఇచ్చిందని వ్యాఖ్యానించారు.

హైదరాబాద్ క్యూర్ పరిధిలో చెరువులకు హైడ్రా జీవం పోస్తూ భావితరాలకు జీవంతో నిండిన భవిష్యత్తును అంకితం చేస్తోందని కొనియాడారు. ఉప్పల్ నల్ల చెరువు పునరుజ్జీవానికి అహర్నిశలు శ్రమించిన హైడ్రా అధికారులు, సిబ్బందికి సీఎం అభినందనలు తెలిపారు. చెరువులను పరిరక్షించడం అంటే కేవలం నీటి వనరులను కాపాడటం మాత్రమే కాదన్న సీఎం భావితరాల భవిష్యత్తును భద్రపరచడం కూడా అని వ్యాఖ్యానించారు. ప్రతి చెరువును కాపాడుతూ ప్రతి అంగుళం ప్రజా ఆస్తిని సంరక్షిస్తూ ముందుకు సాగుతామని తెలిపారు.

# ప్రకృతి ప్రియులకు డెస్టినేషన్ అనంతగిరి

**ఇప్పుడు మరిన్ని సౌకర్యాలతో అభివృద్ధి**

**తెలంగాణ ఊటీగా గుర్తింపు పొందిన అనంతగిరి కొండలు**

**పర్యాటక కేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వం అడుగులు**

**వాటర్‌స్పోర్ట్స్, రిసార్టులు, థీమ్ పార్కులు, వెల్‌నెస్ సెంటర్ల రాకతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు**

పచ్చని అడవి, చుట్టూ కొండలు, ఆహ్లాదకర వాతావరణం అంటే అందరికీ ఇష్టమే. ప్రకృతి ప్రియులకైతే ఇదో భూతల స్వర్గం. ఇలాంటి ప్రదేశాన్ని ఒక్కసారైనా సందర్శించాలనే కోరిక అనేకమందిలో ఉంటుంది. కాగా తెలంగాణలోని అనంతగిరి కొండలు ఈ తరహా వాతావరణాన్ని కలిగి ఉంటాయి. దీంతో ఈ ప్రదేశాన్ని పర్యాటక కేంద్రంగా మార్చేందుకు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. తెలంగాణ ఊటీగా ప్రసిద్ధి చెందిన అనంతగిరి కొండలను దీనిని ఆనుకొని ఉన్న చుట్టుపక్కల చారిత్రక, పర్యాటక ఆకర్షణీయ ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు పర్యాటకశాఖ ప్రణాళికలను సిద్ధం చేసింది. హైదరాబాద్‌కు చేరువలోని వికారాబాద్ జిల్లాలోని అనంతగిరి కొండల్లోని పర్యాటక ఆకర్షణలు కొత్త రూపును సంతరించుకోనున్నాయి. ఓ వైపు ఆహ్లాదకర వాతావరణం మరోవైపు చారిత్రక ప్రాంతాలతో ముడిపడి ఉన్న అనంతగిరి ప్రాంతంలో తొలి దశలో పలు పర్యాటక ఆకర్షణలను అభివృద్ధి చేయనున్నారు.



### వెయ్యి ఏళ్లకు పైగా ఘనమైన చరిత్ర

వికారాబాద్‌కు సమీపంలోని వెయ్యేళ్ల చరిత్ర కలిగిన కంకల్ వీరభద్రస్వామి ఆలయాం ఉంది. దీనిని యాదాద్రి తరహాలో అభివృద్ధి చేయనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. పూడూర్ మండలంలోని కంకల్ గ్రామంలోని కంకంటి వీరభద్రస్వామి ఆలయం పురాతన పుణ్యక్షేత్రం. ఈ గ్రామానికి వెయ్యి ఏళ్లకు పైగా ఘనమైన చరిత్ర ఉంది. ఈ నేపథ్యంలో పర్యాటకశాఖ వికారాబాద్ సమీపంలోని పర్యాటక ఆకర్షణల అభివృద్ధికి ప్రత్యేక కార్యాచరణను సిద్ధం చేస్తోంది.

### వాటర్ స్పోర్ట్స్‌కు ఎంతో అనుకూలం

అనంతగిరికి కేవలం 20 కిలోమీటర్ల దూరంలోని కోటిపల్లి జలాశయం కయాకింగ్, బోటింగ్ వంటి వాటర్ స్పోర్ట్స్?కు ఎంతో అనుకూలంగా ఉంటుంది. దీంతో ఈ ప్రాంతాన్ని ఆ దిశగా అబివృద్ధి చేస్తున్నారు. దీనికోసం వసతుల కల్పనకు శ్రీకారం చుట్టనున్నారు. మరో పర్యాటక ఆకర్షణ సర్పన్‌పల్లి చెరువు ప్రాంతం. చుట్టూ కొండలతో ప్రశాంతమైన వాతావరణం, నిండి ఉండి పర్యాటకులను సేదతీర్చే మరో అద్భుత పర్యాటక ప్రదేశంగా దీన్ని అభివృద్ధి చేయనున్నారు.

### వారాంతాల్లో పెద్ద సంఖ్యలో పర్యాటకులు

ఈ ప్రాంతంలో పర్యాటక ప్రాజెక్టుల రాకతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు. హైదరాబాద్?కు 80 కిలోమీటర్ల దూరంలో ఉండటంతో వారాంతాల్లో నగరం నుంచి వచ్చి గడపాలనుకునే వారితో పాటు ఇతర రాష్ట్రాల పర్యాటకులను ఆకర్షించేలా దృష్టిసారిస్తున్నారు. స్థానికంగా ఉపాధిని మెరుగుపరచడం, మౌలిక వసతులు పెంపొందించడం, పర్యావరణహిత పర్యాటకాన్ని ప్రోత్సహించడమే లక్ష్యంగా పర్యాటక ప్రాజెక్టులు రూపుదిద్దుకోనున్నాయి.

### రిసార్టులు, థీమ్ పార్కులు, వెల్‌నెస్ సెంటర్లు

అనంతగిరి ప్రాంతంలోని 50 ఎకరాల విస్తీర్ణంలో ప్రత్యేక పర్యాటక జోన్? రూపుదిద్దుకోనుంది.

బర్డ్‌వాచ్‌సెంటర్, వ్యూపాయింట్లు, ట్రెక్కింగ్ మార్గాలు, నేచర్ వాక్స్?వంటివి అందుబాటులోకి రానున్నాయి. కట్టుదిట్టమైన భద్రతా, పార్కింగ్ సౌకర్యాలు, పర్యాటక సమాచార కేంద్రాలు తదితర ఏర్పాట్లు చేయనున్నారు. పిల్లల కోసం థీమ్ పార్కులు, వెల్‌నెస్ సెంటర్?లు, పర్యావరణ అనుకూల రిసార్టులు ఏర్పాటు చేయనున్నారు.

### ప్రకృతి ప్రేమికులకు ఇష్టమైన ప్రదేశంగా

అనంతగిరి కొండలు దట్టమైన అటవీ ప్రాంతం. సుందరమైన లోయలు, చల్లని వాతావరణంతో నిండి ఉండే ఈ ప్రాంతం ప్రకృతి ప్రేమికులకు ఎంతో ఇష్టం. ట్రెక్కింగ్‌కు అనుకూలంగా ఉండటంతో ప్రతి వారం వందల సంఖ్యలో పర్యాటకులు ఈ ప్రాంతాన్ని సందర్శిస్తున్నారు. అనంతగిరి కొండల్లోని అనంత పద్మనాభస్వామి వారి దేవాలయం ఉంది. ఇది చారిత్రకంగా ఎంతో ప్రసిద్ధి చెందింది. కార్తీకమాస జాతరకు తెలుగు రాష్ట్రాలతో పాటు కర్ణాటక, మహారాష్ట్ర ప్రాంతాల నుంచి భక్తులు వస్తారు. మూసీ నది (ముచుకుందా నది) ఇక్కడే పుడుతోంది. ఎంతో ప్రాధాన్యం కలిగిన ఈ ప్రాంతాన్ని పర్యాటకశాఖ, దేవాదాయశాఖ అభివృద్ధి చేయనున్నాయి.

## చట్టపరమైన వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యం

-మొదటిపేజీ తరువాయి

మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. తెలంగాణ శాసనసభలో తొలిసారిగా ప్రతిపాదించిన 2026 తెలంగాణ విద్వేషపూరిత నేరాల – హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్స్ బిల్లుపై కీలక ప్రక్రియ ప్రారంభమైంది. బిల్లును మరింత సమగ్రంగా, రాజ్యాంగబద్ధంగా రూపొందించే లక్ష్యంతో ఏర్పాటైన సెలెక్ట్ కమిటీ సమావేశం స్పీకర్ ఛాంబర్‌లో జరిగింది. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ముగిసేలోపు సెలెక్ట్ కమిటీ నివేదికను సభకు సమర్పించాలనే లక్ష్యంతో కార్యాచరణ రూపొందించినట్లు మంత్రి పొన్నం ప్రభాకర్? తెలిపారు. బిల్లుపై శాసనసభ్యులు, శాసనమండలి సభ్యుల అభిప్రాయాలు సేకరించాలని కూడా కమిటీ నిర్ణయించినట్లు తెలిపారు. ఈ చట్టం భవిష్యత్తులో దేశానికే ఆదర్శంగా నిలిచే విధంగా ఉండాలని, అదే సమయంలో రాజ్యాంగం కల్పించిన భావ ప్రకటన స్వేచ్ఛకు ఎలాంటి భంగం కలగకుండా సమతుల్యత పాటించాలని కమిటీ స్పష్టం చేసినట్లు వివరించారు.

ఇది కేవలం శిక్షలు విధించే చట్టం కాదని, సమాజంలో విద్వేషపూరిత వాతావరణాన్ని నిరోధించి సామాజిక సామరస్యాన్ని కాపాడే దిశగా రూపొందిస్తున్న సమగ్ర బిల్లు అని పొన్నం ప్రభాకర్ తెలిపారు. సభలో కానీ, సమాజంలో కానీ విద్వేషపూరిత ప్రసంగాలు, ద్వేషాన్ని ప్రేరేపించే చర్యలకు తావు లేకుండా చట్టపరమైన వ్యవస్థను బలోపేతం చేయడమే లక్ష్యమని తెలిపారు. నిర్మాణాత్మక సూచనలు, ప్రజాప్రతినిధుల అభిప్రాయాలు, నిపుణుల సలహాలను పరిగణనలోకి తీసుకుని తుది నివేదిక సిద్ధం చేస్తామని వెల్లడించారు. మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌తో పాటు కమిటీ సభ్యులు పాల్గొని బిల్లులోని నిబంధనలు, ప్రజాస్వామ్య విలువలు, భావప్రకటన స్వేచ్ఛ, సామాజిక సామరస్యం వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు.

## మోడల్ సోలార్ విలేజ్ టెండర్లలో అవకతవకలు



-మొదటిపేజీ తరువాయి

ఏర్పాటు చేయడంతోపాటు, ఇన్వర్టర్‌లు, మీటరింగ్, గ్రిడ్‌కు అనుసంధానం చేసేందుకు ఒక ఇంటిపై రూ.1.36 లక్షలకు టెండర్ కట్టబెట్టారు. టెండర్ దక్కించుకున్న కేంద్రీయ భండార్ సంస్థ స్థానికంగా సబ్ కాంట్రాక్టర్లకు కేవలం రూ. 86 వేలు మాత్రమే చెల్లించడం గమనార్హం. ఇప్పటికే 9వేల ఇళ్లపై ప్యానెల్స్ ఏర్పాటు పూర్తయినట్లు సమాచారం.

### నాణ్యతపై అనుమానాలు...

టెండర్ దక్కించుకున్న సంస్థ మరీ అంత తక్కువకు సబ్ కాంట్రాక్ట్‌కు అప్పగించడం చూస్తే.. దాని నాణ్యతపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సౌర విద్యుత్ ఫలకలు ఒకసారి ఏర్పాటు చేస్తే.. 25 సంత్సరాల వరకు ఎలాంటి ఇబ్బంది లేకుండా విద్యుత్ ఉత్పత్తి అవుతుందని చెబుతున్నారు. మరి సబ్‌కాంట్రాక్ట్ తీసుకుంటున్న సంస్థలు నాణ్యమైన ఫలకలు ఏర్పాటు చేస్తున్నాయా లేదా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఒక్కో ఇంటిపై సౌర విద్యుత్ ఉత్పత్తికి రూ.1.36 లక్షలు వ్యయయ్యే ఈ పథకంలో రూ.60 వేలు కేంద్రం సబ్సిడీగా ఇస్తుంటే.. రాష్ట్ర ప్రభుత్వం మరో రూ.76 వేలు వెచ్చిస్తూ.. ఉచితంగా అమలు చేస్తోంది. 2 కిలోవాట్ సౌర విద్యుత్‌తో ప్రతీరోజు 8 నుంచి 10 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతుందని అధికారవర్గాలు తెలిపాయి. అంటే నెలకు 240--300 యూనిట్ల వరకు ఉత్పత్తి అవుతుంది. ప్రభుత్వం 200 యూనిట్ల వరకు విద్యుత్ వినియోగించుకునే గృహాలకు గృహజ్యోతి కింద ఉచితంగా విద్యుత్ సరఫరా చేస్తోంది. సౌర విద్యుత్‌ను ఈ గృహాలకు అందించడం వల్ల ప్రభుత్వంపై భారం పడకుండా ఉండటమేకాక.. ఆయా గృహ యజమానులకు వినియోగానికిపోగా అదనంగా ఉత్పత్తయ్యే విద్యుత్‌ను డిస్కమ్‌లకు విక్రయిస్తే ఆదాయం లభిస్తుందని ప్రభుత్వం భావిస్తోంది. ప్రయోగాత్మకంగా ఈ పథకాన్ని మొదట సీఎం రేవంత్‌రెడ్డి సొంతూరులో, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సొంత నియోజకవర్గంలో అమలు చేస్తున్నారు.

### వ్యవసాయ పంపుసెట్లకు...

ఈ 81 గ్రామాల్లోని ఇళ్లకు సౌర విద్యుత్‌ను అందిస్తున్న విధంగానే.. వ్యవసాయ పంపుసెట్లకు సౌర విద్యుత్ అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. 16,078కి పైగా వ్యవసాయ పంపుసెట్లకు (7.5 కిలోవాట్ సామర్థ్యం) సోలార్ ప్యానెళ్లు అమర్చాలని నిర్ణయించింది. ఇందుకోసం ఒక్కో పంపు సెట్‌కు అయ్యే వ్యయం రూ. 4 లక్షలుగా నిర్ణయించారు. వీటి టెండర్ల ప్రక్రియ కొనసాగుతున్నట్లు సమాచారం.

## మంత్రి విస్తరణ లేనట్టే...

-మొదటిపేజీ తరువాయి

లేదా రీషఫుల్ చేపడితే.. పార్టీలో తీవ్ర అసంతృప్తి జ్వాలలు రేగుతాయనే భయం అధిష్ఠానంలో ఉంది. ఇటీవల కర్ణాటక కాంగ్రెస్‌లోనూ, పార్టీ అంతర్గత రాజకీయంలోనూ చోటుచేసుకున్న పరిణామాలు, అసంతృప్తుల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని.. తెలంగాణలో ఉన్న శాంతిభద్రతలను, ప్రభుత్వ స్థిరత్వాన్ని దెబ్బతీసే సాహసం ఇప్పుడు చేయకూడదని హైకమాండ్ ఒక స్పష్టమైన ముగింపునకు వచ్చినట్లు తెలుస్తోంది.మరోవైపు, కాంగ్రెస్ పార్టీలో మంత్రి పదవుల పోటీ ఊహించని మలుపులు తిరుగుతోంది. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, వంటి సీనియర్లు ఒకవైపు గట్టిగా ఒత్తిడి తెస్తుండగా.. జెన్–జీ నినాదంతో యువ ఎమ్మెల్యేలకు సైతం ప్రాతినిధ్యం కల్పించాలనే చర్చ సరికొత్త సమీకరణాలను తెచ్చిపెట్టింది. సీఎం రేవంత్ రెడ్డి సైతం యువ ముఖాలకు అవకాశం ఇవ్వాలనే ఆలోచనను తెరపైకి తెచ్చినట్లు వార్తలు రావడం, స్థానిక సంస్థల సమయానికి ఓటు బ్యాంకును ఆకట్టుకోవాలనే వ్యూహాలు రేసును మరింత సంక్లిష్టంగా మార్చాయి. సీనియర్ వర్సెస్ జూనియర్, రెడ్డి వర్సెస్ బీసీ, ఎస్సీ సామాజిక సమీకరణాల మధ్య సమతుల్యత సాధించడం దాదాపు అసాధ్యంగా మారడంతోనే విస్తరణ నిర్ణయాన్ని వాయిదా వేశారు.ఢిల్లీ వేదికగా ఏఐసీసీ పెద్దలు తెలంగాణ నేతలకు చాలా స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. పాలిటిక్స్ పక్కనపెట్టి, పాలనపై దృష్టి సారించాలని, సంక్షేమ పథకాలను క్షేత్రస్థాయికి వేగంగా తీసుకెళ్లాలని సూచించారు. ముఖ్యంగా ప్రతి 45 రోజులకు ఒకసారి పీసీసీ సమన్వయ కమిటీ సమావేశాలు నిర్వహించి.. ప్రభుత్వం, పార్టీ యంత్రాంగం మధ్య సయోధ్యను పెంచాలని ఆదేశించారు. రాబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు, ఓటర్ల నమోదు ప్రక్రియపై దృష్టి పెట్టాలని, మంత్రి పదవుల కోసం ఢిల్లీ చుట్టూ తిరగడం కన్నా నియోజకవర్గాల్లో పార్టీని బలోపేతం చేయడానికే ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని ఆశావహులకు నర్మగర్భ హెచ్చరికలు జారీ చేసినట్లు సమాచారం. హైకమాండ్ వ్యూహాన్ని గమనిస్తే.. పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన వేళ, ఈ రకమైన అంతర్గత కుమ్ములాటలు, ముఠా తగాదాలు బయటపడితే అది కాంగ్రెస్ ఇమేజ్‌ను ప్రజల్లో దెబ్బతీస్తుందనే ఆందోళన వారిలో స్పష్టంగా కనిపిస్తోంది. అందుకే కేబినెట్‌ను కదిలించి తేనెతుట్టెను రేపడం కంటే ఉన్న వనరులతోనే పాలనను పరుగులు పెట్టించడం శ్రేయస్కరమని భావిస్తున్నారు. ఢిల్లీ పర్యటనతో ఏదో ఒక శుభవార్త వింటామని భావించిన ఆశావహులకు అధిష్ఠానం రివర్స్ షాక్ ఇచ్చిందనే చెప్పాలి. పదుల సంఖ్యలో ఉన్న మంత్రి పదవుల పోటీదారులకు చెక్ పెడుతూ, సర్కార్ గ్రాఫ్‌ను పెంచుకునే పనుల్లో నిమగ్నం కావాలని ఆదేశించడంతో.. తెలంగాణ కాంగ్రెస్‌లో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ప్రక్రియ ప్రస్తుతానికి మళ్లీ మొదటికొచ్చినట్లే కనిపిస్తోంది

## సంపాదకీయం

# సీజేపీ సైలెంట్ ఉద్యమం


నీట్ పేపర్ లీకేజీ, విద్యా వ్యవస్థలోని లోపాలపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నడిపిన ఉద్యమం ఇటీవల దేశ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో ఉద్యమం పైకి ఆగినట్లు కనిపించినా, విశ్లేషకులు దీన్ని కేవలం తాత్కాలిక ఎత్తుగడగా చూస్తున్నారు. సీజేపీ ఇప్పుడు వ్యవస్థలో నిలబడి, ఎన్నికల్లో పోటీ చేసి, బీజేపీకి వ్యతిరేకంగా విస్తృత కూటమి నిర్మించాలని ప్రయత్నిస్తోందని తెలుస్తోంది. విద్యార్థుల నిరసనలు మంత్రి రాజీనామాకు దారితీశాయి. ఇది ఉద్యమకారులకు తక్షణ విజయంగా కనిపించినా, సీజేపీకి అసలు లక్ష్యం అంతకు మించినదని స్పష్టమవుతోంది. రాజీనామా తర్వాత ప్రధాన ఇష్యూ కనుమరుగైంది. విద్యార్థులపై అనేక కేసులు నమోదయ్యాయి. దాడులు, రాళ్లు విసిరినవారిని గుర్తించడంతో పలువురు మళ్లీ ఉద్యమానికి రావడం కష్టమైంది. ఫలితంగా బహిరంగ నిరసనలు ఆగిపోయాయి. అయినా సీజేపీ సీనియర్ కార్యకర్తల కార్యకలాపాలు ఆగలేదు. వారు వివిధ వ్యక్తులను కలుస్తూ, వ్యూహాలు రూపొందిస్తున్నారు. సీజేపీలో అశుతోష్ రాంకా కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆప్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్న ఈయన ఇప్పుడు సీజేపీలో ప్రముఖంగా కనిపిస్తున్నారు. దీపికా బలీయ కూడా ముందుకు వచ్చారు. జాట్ సమాజానికి చెందిన ఈ మహిళా నేత ఇటీవల సంయుక్త కిసాన్ మోర్చా సమావేశానికి హాజరై కేంద్ర వ్యతిరేక స్వరం వినిపించారు. అక్కడే రైతు నేత రాకేశ్ టికాయత్‌ను కలిశారు. 2020?21 రైతు ఉద్యమంలో కీలకంగా వ్యవహరించిన టికాయత్‌తో సంపర్కాలు సీజేపీకి రైతు శక్తిని చేర్చుకునే అవకాశం కల్పిస్తున్నాయి. అంతకుముందు సమాజ్‌వాదీ పార్టీ నేతలు, ఆజాద్ సమాజ్ పార్టీ, ఆప్ నాయకులతోనూ చర్చలు జరిగాయి. యాంటీ బీజేపీ కూటమిని ఏర్పాటు చేసి ఏకీకృత పోరాటం చేయాలనే లక్ష్యంతో ఈ భేటీలు సాగుతున్నాయి. రాకేశ్ టికాయత్‌కు ఉత్తరప్రదేశ్ జాట్ సమాజంలో పట్టు ఉంది. అజీత్‌సింగ్, హరియాణాలోని ఓం ప్రకాశ్ చౌతాల కుటుంబం వంటి జాట్ నాయకులతో కలిసి కూటమి ఏర్పాటు చేయాలని ప్రయత్నాలు జరుగుతున్నాయి. యూపీలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో జాట్ ఓట్లను బీజేపీ నుంచి దూరం చేయడమే లక్ష్యం. 2021?22 రైతు ఉద్యమంలో ఢిల్లీకి వచ్చే రోడ్లు దిగ్బంధించిన అనుభవాన్ని సీజేపీ ఉపయోగించుకోవాలని చూస్తోంది. అప్పటి సంఘటనల్లో ఎర్రకోట వద్ద జరిగిన కొన్ని సంఘటనలు, ఒక ఉద్యమకారుడి మరణం వంటివి ఇప్పటికీ చర్చనీయాంశాలే. అయితే ప్రస్తుతం సీజేపీ మరింత విస్తృత బేస్ నిర్మించడంపై దృష్టి సారించింది. విద్యార్థుల్లోని యాంటీ మోదీ సెంటిమెంట్‌ను రైతు సంఘాలు, విపక్షాలతో కలిపి యూపీ, గుజరాత్, గోవా వంటి రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీని సవాలు చేయాలని భావిస్తోంది. ప్రాంతీయ పార్టీలకు లబ్ధి చేకూర్చే వ్యూహాలు రూపొందుతున్నాయి. కాంగ్రెస్ కూడా సీజేపీతో సఖ్యతగా వ్యవహరిస్తూ ప్రోత్సహిస్తోంది. మంత్రి రాజీనామాతో సీజేపీకి స్పష్టమైన విజయంగా చెప్పుకునే అవకాశం తగ్గింది. విద్యార్థుల ఉద్యమం ఆగిపోవడం, కేసులు నమోదు కావడం పెద్ద సవాళ్లు. అయినా సైలెంట్‌గా సాగుతున్న ప్రయత్నాలు, కీలక నేతల సంపర్కాలు చూస్తే ఉద్యమం పూర్తిగా ఆగిపోలేదని స్పష్టం. కొంతమంది జంతర్‌మందతర్ ఉద్యమం వద్ద రీల్స్ చేయడం ద్వారా ఫాలోవర్ల సంఖ్య పెంచుకున్నారు. ఓ మైనర్‌కు ఇన్‌స్టాలో మొదట 5 వేల మంది ఫాలోవర్లు ఉండేవారట. జంతర్‌మంతర్ వద్ద రీల్ చేసి ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్టు చేయడంతో అతని ఫాలోవర్లు 7.5 లక్షలకు పెరిగారట. ఫాలోవర్ల పెరుగుదలతో కొందరు కొత్త ఫోన్ కొనుక్కుని అక్కడే విజయం సాధించానని చెప్పుకున్నారు. ఇలాంటి సంఘటనలు ఉద్యమం కంటే వ్యక్తిగత ప్రచారం, కంటెంట్ సృష్టి మీద దృష్టి పెట్టినట్లు అనిపిస్తుంది. ఇన్‌స్టాగ్రామ్ వంటి ప్లాట్‌ఫామ్‌లు యువతను ఆకర్షించి, వారిని వేదిక వద్దకు తీసుకువచ్చే శక్తిగా మారాయి. కొంతమంది దూషించి, ద్వేషపూరిత వ్యాఖ్యలతో రీల్స్ చేసి ప్రజల నుంచి విమర్శలు ఎదుర్కొన్నారు. అయినా కొందరు లబ్ధి పొందినట్లు కనిపిస్తోంది. ఇలాంటి విధానం ఉద్యమం యొక్క అసలు ఉద్దేశాన్ని దెబ్బతీస్తుంది. సానుకూలంగా, నిజమైన సమస్యలపై అవగాహన కల్పించే రీల్స్ చేస్తే మంచిది కానీ, ద్వేషం, తిట్లు ద్వారా దష్టి సాధించే ప్రయత్నాలు ప్రజా మద్దతును బలహీనపరుస్తాయి. తాజా జంతర్‌మంతర్ రీల్స్ ఇన్‌స్టా బేస్డ్ హెజిటేషన్ అనే ధోరణిని సూచిస్తున్నాయి. అంటే సామాజిక మాధ్యమాల్లో కనిపించే విధంగా, లైక్‌లు, ఫాలోవర్లు పెరగాలనే ఆలోచనతోనే చాలామంది పాల్గొంటు న్నారు. నిజమైన సమస్యలపై పోరాటం కంటే వైరల్ కంటెంట్ సృష్టి ప్రధానమైపోతే ఉద్యమం బలహీనపడుతుంది. అదే సమయంలో సామాజిక మాధ్యమాలు సమాచారం వ్యాప్తి చేయడంలో, యువతను సమీకరించడంలో సహాయపడతాయి జంతర్‌మంతర్ వద్ద జరిగిన ఈ ఉద్యమంలో రీల్స్ పాత్ర కీలకంగా కనిపిస్తోంది. సామాజిక మాధ్యమాలు ఆధునిక ప్రజా ఉద్యమాల ఆకారం మార్చేస్తున్నాయి. అయితే వాటిని సానుకూలంగా, నిజాయితీగా ఉపయోగిస్తేనే అసలు లక్ష్యాలు నెరవేరుతాయి. రాజకీయాల్లో బలమైన శక్తిగా మారాలనే లక్ష్యంతో సీజేపీ కదులుతోంది. ఈ ప్రయత్నాలు ఎంతవరకు విజయవంతం అవుతాయో, యాంటీ బీజేపీ ఫ్రంట్ ఎలా రూపుదిద్దుకుం టుందో రాబోయే నెలల్లోనే స్పష్టమవుతుంది.

# ఎన్డీయేకు ముందున్నది ముసళ్ల పండుగ!



నీట్ ప్రశ్నపత్రాల లీకేజీ వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఢిల్లీలో కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో యువత, విద్యార్థులు ఇటీవల కొన్ని రోజులపాటు నిర్వహించిన ఆందోళన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. సీజేపీ ఆందోళన దేశంలోని వాస్తవ స్థితిగతులను ప్రతిబింబించింది. ఒక్క ప్రశ్నపత్రాల లీకేజీనే కాదు. ధరల పెరుగుదల, నిరుద్యోగం, అప్పులు, రూపాయి క్షీణత వంటివి ఎన్డీయే పాలనపై విద్యార్థులు, యువత, ప్రజల్లో నెలకొన్న అసంతృప్తిని బహిర్గతం చేశాయి. ఎన్డీయే అధికారంలో ఉన్న ఈ 12 ఏండ్లలో దేశం పురోగమనం చెందిందని బీజేపీ, దాని మిత్రపక్షాలు డప్పు కొట్టుకుంటున్నాయి. కానీ, దేశంలోని ఏ వర్గంలోనూ సంతృప్తి లేదు. పేదరికం ఆనవాళ్లు పోలేదు. విదేశాల్లో దాచిపెట్టిన నల్లధనాన్ని భారతదేశానికి తెప్పించి ప్రతి ఒక్కరి బ్యాంక్ అకౌంట్‌లో రూ.15 లక్షలు డిపాజిట్ చేస్తామని నమ్మించిన ఎన్డీయే ఆ తర్వాత మొండిచేయి చూపింది. దేశంలో నిరుద్యోగమే ప్రధాన సమస్యగా ఉన్నది. అది యేటేటా పెరుగుతూ ప్రస్తుతం 16 శాతానికి చేరింది. యేటా విద్యావంతులు, పట్టభద్రులు, పీజీ, పీహెచ్‌డీల సంఖ్య పెరుగుతున్నా వారికి ఉద్యోగాలు, ఉపాధి గగనంగా మారాయి. దేశంలో చదువుకు తగిన ఉద్యోగం చేస్తున్న పట్టభద్రులు కేవలం 8.25 శాతం మంది మాత్రమే. కేంద్రం నిరుద్యోగ సమస్య పరిష్కరించడంలో విఫలం కావడంతో దేశంలో 22 కోట్ల మంది పట్టభద్రులు నిరుద్యోగులుగా ఉన్నారు. సాధారణ పట్టభద్రుల్లో 84 శాతం మంది, ఇంజినీరింగ్ పట్టభద్రుల్లో ప్రతి 10 మందిలో 8 మందికి కొలువులు రావట్లేదు. యేటా 2 కోట్ల ఉద్యోగాలు ఇస్తామని మోదీ సర్కార్ ఇచ్చిన హామీ బూటకంగా మిగిలిపోయింది. విద్యావ్యవస్థలో సమూల మార్పులు జరగడం లేదు. నిత్యం విద్యార్థుల ఆత్మహత్యలు, ర్యాగింగ్‌లు, వేధింపులు జరుగుతున్నాయి. ఉపాధి ఆధారిత విద్యావిధానం అమలుపై దృష్టి సారించడం లేదు. మతం పేరిట భావోద్వేగాలను రెచ్చగొట్టి విద్యార్థులకు సైతం పావులుగా వాడుకుంటున్నది తప్ప వారి జీవితాల్లో కొత్త వెలుగులు తెచ్చేందుకు ఏ మాత్రం ప్రయత్నించడం లేదు. నిత్యావసరాల ధరల మీద నియంత్రణ లేదు. బియ్యం, పాలు, వంటనూనె, పప్పులు, గోధుమపిండి, చక్కెర, ఇతర వినియోగ వస్తువుల ధరలు 12 ఏండ్లలో 40 శాతం నుంచి 400 శాతం వరకు పెరిగాయి. వంటగ్యాస్, చమురు ధరలు గరిష్ఠ స్థాయికి చేరాయి. ఎన్నికల సమయంలో తప్ప మిగిలిన సమయాల్లో పెట్రో ధరలు పెంచడమే లక్ష్యంగా కేంద్రం వ్యవహరిస్తున్నది. 120 ప్రభుత్వరంగ సంస్థలను అతి తక్కువ ధరకే బడా పారిశ్రామికవేత్తలకు కట్టబెట్టారు. రైతాంగం పరిస్థితి దయనీయ స్థితికి చేరుకున్నది. విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల ధరలు పెరిగాయి. రైతులకు గిట్టుబాటు ధర రావడం లేదు. నిత్యం రైతాంగం ఆందోళన చేస్తుంటే వారిని అడ్డుకోవడానికి ప్రయత్నిస్తున్నదే తప్ప సమస్యల పరిష్కారానికి చొరవ చూపడం లేదు. పేదలు, రైతులకు రుణమాఫీకి వ్యతిరేకమని చెప్పిన కేంద్రం పెద్ద పెద్ద కంపెనీలకు రుణ రాయితీలిచ్చి ఇచ్చి వాటిపై ప్రేమను చాటుకుంటున్నది. 2024లో 10,546 మంది రైతులు, రైతు కూలీలు ఆత్మహత్యకు పాల్పడినట్టు ఎన్‌సీఆర్‌బీ నివేదిక వెల్లడించింది. 67 ఏండ్లు పాలించిన ప్రభుత్వాలు రూ.55 కోట్ల లక్షల అప్పు చేస్తే ఎన్డీయే సర్కార్ ఇప్పటికే రూ.155 లక్షల కోట్లు అప్పు చేసింది. అంటే దేశంలో ప్రతి ఒక్కరిపైనా అప్పు లక్షా ఇరవై వేలకు చేరింది. పెద్ద నోట్ల రద్దు వల్ల భారత ఆర్థిక వ్యవస్థ బలహీనపడింది. దేశంలోని పేద, మధ్యతరగతి ప్రజలు ఆర్థిక ఇబ్బందులకు గురికాగా, బడాబాబులు కుబేరులయ్యారు. భారత్‌లో తయారీ (మేకిన్ ఇండియా)ని విశ్వవ్యాప్తంగా చేస్తామని బీజేపీ చెప్పగా చివరికి విదేశాల నుంచి దిగుమతులు పెంచింది. దేశ రైతాంగాన్ని, పారిశ్రామికరం గాన్ని దెబ్బతీసేలా అమెరికా, బ్రిటన్ వంటి దేశాలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకున్నది. నైతిక విలువలకు తిలోదకాల్చి రాజకీయ పార్టీలను చీల్చడం, బలహీనపరచడం, ప్రజాస్వామ్య పద్ధతిలో రాజ్యాంగబద్ధంగా ఎన్నికైన బీజేపీయేతర ప్రభుత్వాలను కూలదోస్తున్నది. తమ మాట వినని ప్రతిపక్ష పార్టీల నేతలను వివిధ స్కామ్‌లలో ఇరికించి జైలుపాలు చేయడం ఆనవాయితీగా మారింది. ప్రభుత్వ దర్యాప్తు సంస్థలైన సీబీఐ, ఈడీ, ఆదాయ పన్ను శాఖలు రాజకీయ లక్ష్యాల సాధనకు ఉపయోగపడుతున్నాయి. ఈడీ ఇప్పటివరకు 121 కేసులు నమోదు చేయగా 95 శాతం విపక్ష నాయకులపై మనీ లాండరింగ్ చట్టం కింద పెట్టిన కేసులు 5,420. అందులో 5,150 కేసులు ప్రతిపక్ష నేతలపైనే ఉన్నాయి. వివిధ రాజకీయ పార్టీల నేతలపై 149 రాజద్రోహం కేసులు నమోదయ్యాయి. విద్యావ్యవస్థ మరింత దెబ్బతిన్నది. ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత, ఉత్పాదకత, పౌర స్వేచ్ఛ, లింగ సమానత్వం, విద్య, వైద్యం వంటి రంగాల్లో మనదేశం ర్యాంకు యేటేటా తగ్గుతున్నది. 2014లో మోదీ నేతృత్వంలో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గడిచిన 12 ఏండ్లలో దేశంలో 68 ఉగ్రదాడులు జరిగాయి. ఆయా ఘటనల్లో 360 మంది వరకు సైనికులు, పోలీసులు అమరులయ్యారు. 230 మంది పౌరులు మృతి చెందారు. 2014 నుంచి ఇప్పటివరకూ ఒక్క జమ్ముకశ్మీర్‌లోనే 11 ఉగ్రదాడి ఘటనలు జరిగాయి. 2016లో జరిగిన 'ఉరి' ఉగ్రదాడి, 2019లో జరిగిన 'పుల్వామా' దాడి, గత యేడాది జరిగిన పహల్గాం ఉగ్రదాడి, ఎర్రకోట దగ్గర కారు పేలుడుతో యావత్తు దేశం వణికిపోయింది. మన విదేశాంగ విధానం సరిగా లేదు. సమయస్ఫూర్తి లోపించడం వల్ల అనేక దేశాలతో అంతరం క్రమేణా పెరుగుతున్నది. దిగుమతులపై ఆధారపడిన దేశానికి ఈ విధానాలు సమస్యగా మారి సంక్షోభాన్ని సృష్టిస్తున్నాయి. అధికారపక్షాన్ని నిలదీసి ప్రజావ్యతిరేక విధానాలను అడ్డుకోవాల్సిన గురుతర బాధ్యత విపక్షాలకే ఉంటుంది. కానీ ప్రధాన ప్రతిపక్షంగా కాంగ్రెస్ ఆ దిశగా ఎదగడం లేదు. పోరాటపంథా లోపించి ఎన్డీయేను ఢీకొట్టడంలో అది విఫలమవుతున్నది. 2024 ఎన్నికల సందర్భంగా విపక్షాల బలం పెరిగినా దానిని సద్వినియోగం చేసుకోలేకపోతున్నాయి. అన్ని విపక్షాలను ఏకం చేసి ఎదుర్కొనే అవకాశం ఉన్నా అలాంటి చొరవ కాంగ్రెస్‌లో లోపిస్తున్నది. దేశంలో అత్యధిక విపక్ష ఎంపీలున్న డీఎంకే వంటి పార్టీని వీడి, అధికారంలో పాలుపంచుకోవడానికి తమిళనాడులో విజయ్ నాయకత్వంలోని టీవీకే పార్టీతో చేతులు కలుపడం ఆ పార్టీ వ్యూహరాహిత్యాన్ని బహిర్గతం చేసింది. కాంగ్రెస్‌లో సమర్థులున్నా వారి సేవలను ఆ పార్టీ వినియోగించుకోలేక రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీలపైనే ఆధారపడుతున్నది. మరోవైపు దేశంలోని మీడియాను ఎన్డీయే ప్రభుత్వం గుప్పిట్లోకి తీసుకొంటున్నది. విపక్షాలు విఫల మైనపుడు ఆ పాత్ర పోషించాల్సిన మీడియా ప్రేక్షకపాత్ర, అధికారపక్షానికి వంతపాడటానికే ప్రాధాన్యం ఇస్తున్నది. జంతర్ మంతర్‌లో సీజేపీ ఆందోళన సందర్భంగా మీడియా వైఖరిపై విద్యార్థులు, యువత ఆగ్రహం ప్రదర్శిం చారు. సీజేపీ ఆందోళన ఎన్డీయే ప్రభుత్వానికి గుణపాఠమైంది. కాంగ్రెస్, ఇతర రాజకీయ పార్టీలు, మీడియాకు సైతం కనువిప్పు కలిగించింది. దేశంలోని విద్యార్థి, యువత, రైతులు, అన్ని వర్గాల ప్రజలను చైతన్యపరిచింది. ప్రజాస్వా మ్యంలో ప్రతిపక్షాలు నిర్వీర్యమైనా, మీడియా అధికారపక్షానికి కొమ్ముకాసినా ఆ పాత్రను వారే పోషిస్తారనే సత్యాన్ని వెల్లడిం చింది. ఇది ముమ్ముందు పెనుమార్పులకు దారితీస్తుంది. సామదానభేద దండోపాయాలతో వ్యవహరిస్తున్న కేంద్రం ఇప్పటికైనా తన వైఖరి మార్చుకోకపోతే రానున్న రోజుల్లో మరింత ప్రజాగ్రహాన్ని చవిచూడాల్సి వస్తుంది. మీడియా సైతం తన ధోరణిని మార్చుకోవాలి. ప్రజల కోణంలో ఆలోచించి నడుచుకోవాలి. విద్యావ్యవస్థ మరింత దెబ్బతిన్నది. ద్రవ్యోల్బణం, నిరుద్యోగిత, ఉత్పాదకత, పౌర స్వేచ్ఛ, లింగ సమానత్వం, విద్య, వైద్యం వంటి రంగాల్లో మనదేశం ర్యాంకు యేటేటా తగ్గుతున్నది. 2014లో మోదీ నేతృత్వంలో కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి గడిచిన 12 ఏండ్లలో దేశంలో 68 ఉగ్రదాడులు జరిగాయి. ఆయా ఘటనల్లో 360 మంది వరకు సైనికులు, పోలీసులు అమరులయ్యారు. 230 మంది పౌరులు మృతి చెందారు.

# సంస్కరణలు కాదు ప్రత్యామ్నాయం కావాలి



కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా భారత విద్యార్థి ఉద్యమానికి ఒక ము ఖ్యమైన రాజకీయ విజయం. అయితే ఆయన రాజీనామా లేఖలో ఒక పెద్ద వైరుధ్యం కనిపిస్తున్నది. పరిపాలనా వైఫల్యాన్ని అంగీకరించిన చర్యగా కాకుండా, విద్యార్థుల ప్రయోజనాల కోసం, దేశ ఐక్యతను కాపాడేందుకు తీసుకున్న రాజకీయ, నైతిక నిర్ణయంగా తన రాజీనామాను చిత్రీకరించారు. అంటే బాధ్యతను అంగీకరించే బదులు, తాను బాధితుడిననే భావనను ముందుకు తెచ్చారు. ఇపుడు సమస్య ఒక మంత్రి గురించో, ఒక ప్రశ్నాపత్రం లీక్ గురించో కాదు. మన విద్యావ్యవస్థ క్రమంగా కేంద్రీకృతమై, వ్యాపారీకరణ చెంది, విద్యార్థులపై తీవ్రమైన ఒత్తిడిని మోపే విధంగా మారిపోయిందనే విషయాన్ని విద్యార్థి ఉద్యమం ఎత్తిచూపుతున్నది ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉన్నత స్థాయి టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేసింది. డిజిటల్ పరీక్షలను మరింత భద్రంగా నిర్వహించడం, ప్రశ్నాపత్రాల లీకులను అరికట్టడం దీని లక్ష్యం. అయితే, సాంకేతిక భద్రతను మెరుగుపరచడం అవసరమే. కానీ ఇవి పైపై సంస్కరణలు మాత్రమే, సమస్య మూలాలను ఏమాత్రం పరిష్కరించలేవు. ఈ సందర్భంగా తమిళనాడు ప్రభుత్వం కొన్నేండ్లుగా చేస్తున్న వాదనను తెలుసుకోవాలి. నీట్ విధానం సామాజిక న్యాయానికి వ్యతిరేకమని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద, గ్రామీణ, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు అన్యాయం చేస్తుందని వాదిస్తున్నది. పన్నెండో తరగతి విద్యను పక్కనబెట్టి, ఒకే పరీక్ష ఆధారంగా వైద్య విద్యలో ప్రవేశాలు ఇవ్వడం విద్యలో సమాన అవకాశాల సూత్రానికి విరుద్ధమని పేర్కొంటున్నది. జస్టిస్ ఏకే రాజన్ కమిటీ కూడా ఇదే విషయాన్ని స్పష్టంగా చెప్పింది. దేశమంతటా ప్రవేశాలను ఒకే సంస్థ నియంత్రించినపుడు, ఒక చిన్న సాంకేతిక లోపం, ఒక ప్రశ్నాపత్రం లీక్ లేదా ఒక పరిపాలనా పొరపాటు కూడా జాతీయ స్థాయి సంక్షోభంగా మారుతుంది. అధిక కేంద్రీకరణ ప్రమాదాలను తగ్గించలేదు. వాటిని మరింత పెంచుతుంది. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఏర్పాటైనపుడే ప్రగతిశీల విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాలు, అనేక రాష్ట్ర ప్రభుత్వాలు ఇదే హెచ్చరించాయి. అన్ని పరీక్షలను ఒకే సంస్థ చేతిలో పెట్టడం వల్ల సమాఖ్య వ్యవస్థ బలహీనపడుతుందని, మొత్తం ప్రవేశ ప్రక్రియ వ్యవస్థాగత వైఫల్యాలకు గురవుతుందని వారు స్పష్టం చేశారు. ఇపుడు వారి హెచ్చరికలు నిజమయ్యాయని స్పష్టంగా తెలుస్తున్నది. ఈ సంక్షోభాన్ని జాతీయ విద్యావిధానం 2020 తర్వాత విద్యలో జరిగిన విస్తృత మార్పుల నుంచి వేరుచేసి చూడలేం. ఇటీవల వచ్చిన విశ్లేషణలు కూడా ఇదే విషయాన్ని చెప్తున్నాయి. పరీక్షల కేంద్రీకరణ, కంప్యూటర్ ఆధారిత పరీక్షలు, బహుళ ఐచ్ఛిక ప్రశ్నలు, విశ్వవిద్యాలయాల స్వయం ప్రతిపత్తి తగ్గించడం వంటి చర్యలు విద్యలో వైవిధ్యం, ప్రజాస్వామ్యాన్ని బలహీనపరుస్తూ, ప్రామాణీకరణ, అధికార కేంద్రీకరణను పెంచుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ కొత్త టాస్క్‌ఫోర్స్ లక్ష్యాలు పూర్తిగా విస్మరించిన మరో ముఖ్యమైన అంశం కోచింగ్ పరిశ్రమ. ప్రపంచంలోనే అతిపెద్ద కోచింగ్ మార్కెట్లలో భారత్ ఒకటి. ఇపుడు విజయం కేవలం ప్రతిభపై మాత్రమే ఆధారపడడం లేదు. ఖరీదైన కోచింగ్‌ను పొందే ఆర్థిక స్తోమతపై కూడా ఆధారపడుతున్నది. అనేక నగరాలు కోచింగ్ కేంద్రాలుగా మారిపోయాయి. కేంద్ర ప్రభుత్వం రూపొందించే కొత్త టాస్క్‌ఫోర్స్‌పై సందేహాలు కలుగడానికి మరో కారణం కూడా ఉన్నది. 2024లో జరిగిన నీట్ వివాదాల తర్వాత ప్రభుత్వం రాధాకృష్ణన్ కమిటీని ఏర్పాటు చేసింది. ఆ కమిటీ పరీక్షల నిర్వహణ, పారదర్శకత, జవాబుదారీతనం వంటి అంశాలపై అనేక సూచనలు చేసింది. కానీ వాటిలో చాలావరకు అమలు కాలేదు. అందువల్ల సమస్య కమిటీల కొరత కాదు. రాజకీయ సంకల్పం లేకపోవడమే అసలు సమస్య. గత కమిటీ సూచనలను అమలు చేయకుండా మరో కమిటీ వేయడమంటే ప్రజల ఆగ్రహాన్ని తాత్కాలికంగా చల్లార్చే ప్రయత్నంగానే కనిపిస్తున్నది. భారతదేశానికి డిజిటల్ సంస్కరణలు మాత్రమే సరిపోవు. పరీక్షల కేంద్రీకరణను తగ్గించాలి. రాష్ట్రాలు, విశ్వవిద్యాలయాలకు తగిన పాత్రను తిరిగి ఇవ్వాలి. ఒకే ప్రవేశపరీక్షపై ఆధారపడకుండా, ప్రవేశాలకు అనేక ప్రమాణాలను అమలు చేయాలి. కోచింగ్ పరిశ్రమను నియంత్రించాలి. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలి. పరీక్షల నిర్వహణలో తప్పులు జరిగితే విద్యార్థులకు న్యాయం జరిగేలా చట్టబద్ధమైన జవాబుదారీ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. సాంకేతికత ఒక పరీక్షను భద్రంగా నిర్వహిం చగలదు. కానీ న్యాయాన్ని అందించలేదు. ఒక మంత్రి రాజీనామా తక్షణ రాజకీయ ఒత్తిడిని తగ్గించవచ్చు. ఒక కొత్త టాస్క్‌ఫోర్స్ మరో నివేదిక ఇవ్వవచ్చు. మెరుగైన సైబర్ భద్రత ప్రశ్నాపత్రాల లీకులను కొంతవరకు అడ్డుకోవచ్చు. కానీ విద్యావ్యవస్థలోని అధిక కేంద్రీకరణ, వ్యాపారీకరణ, ప్రభుత్వ విద్య బలహీనపడడం వంటి మూల సమస్యలను పరిష్కరించకపోతే పరీక్షల సంక్షోభాలు మళ్లీ మళ్లీ తలెత్తుతూనే ఉంటాయి. అందువల్ల భారతదేశం నిర్మించాల్సింది కేవలం మరింత భద్రమైన పరీక్షా వ్యవస్థ కాదు. మరింత ప్రజాస్వామ్యబద్ధమైన, సమానత్వంతో కూడిన విద్యావ్యవస్థ.

నవగీతం
తెలుగు దినపత్రిక
ఆదివారం
2 ఆగస్టు 2026

# పెండింగ్ లో ఉన్న సాగునీటి పనులు పూర్తి చేస్తాం..

## స్తంభంపల్లి చెరువును పరిశీలించిన మంత్రి అడ్లూరి..





**నవగీతం,(వెల్గటూర్ ప్రతినిధి)** ధర్మపురి నియోజకవర్గ గోదావరి పక్కనే ఉన్నప్పటికీ గత ప్రభుత్వ కాలంలో రైతులకు అవసరమైన సాగునీటి పనులను పట్టించుకోలేదని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆరోపించారు. శనివారం జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం స్థంభం పల్లి గ్రామంలోని చెరువును మంత్రి పరిశీలించారు.ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ 2014 తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ధర్మపురి నియోజకవర్గంలోని రైతుల అవసరాలకు ఉపయోగపడే సాగునీటి ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేశారని అన్నారు. నియోజకవర్గంలో కీలకమైన రోళ్ళ వాగు ప్రాజెక్టు అంచనాలు పెంచి ప్రాజెక్టు పూర్తి చేయకుండా వదిలేశారని అన్నారు. అక్కపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు కాగితాలకే పరిమితం అయ్యిందని మంత్రి ఆరోపించారు.రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నియోజకవర్గంలో పెండింగ్ లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను దశలవారీగా పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా రోళ్ళ వాగు ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేస్తున్నామని అక్కపల్లి లిఫ్ట్ పనులు పూర్తి చేసి 2027 జనవరి 27 వరకు నీటిని ఎత్తిపోస్తామని మంత్రి హామీ ఇచ్చారు.
స్తంభంపల్లి లిఫ్ట్ పనులు పూర్తి చేయడంతో పాటు స్థంభంపల్లి చెరువు మత్తడి మరమ్మత్తు, తుముల వెడల్పు మరమ్మతుకు రూ. 5 లక్షల కేటాయిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. గొల్లపల్లి మండలంలోని యశ్వంతరావుపేట చెరువు పూడికతీత పనులు పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు. మేడారం రిజర్వాయర్ నుండి ముంజంపల్లి, మారేడుపల్లి గ్రామాలకు సాగునీటిని అందించడానికి చర్యలు తీసుకుంటున్నామని మంత్రి అన్నారు. బొమ్మరెడ్డిపల్లి కొత్తపల్లి వరకు కాల్వ పనులు పూర్తి చేస్తామని నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీటిని అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు మంత్రి వివరించారు.

# జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ ఎన్నికలు ఏకగ్రీవం....

## అధ్యక్షుడిగా భాషవేణి మల్లేశం యాదవ్ ఏకగ్రీవ ఎన్నికైనట్లు ప్రకటించిన ఎన్నికల అధికారి జలాలొద్దీన్ అక్బర్...





**నవగీతం,కరీంనగర్ ప్రతినిధి:** జిల్లాల పునర్విభజన అనంతరం తెలంగాణ రాష్ట్రంలో జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార సంఘాల యూనియన్ ఎన్నికలు పూర్తయిన తొలి జిల్లాగా కరీంనగర్ నిలిచిందని, జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్‌కు అధ్యక్ష, ఉపాధ్యక్ష మరియు, డైరెక్టర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని ఎన్నికల అధికారి తెలిపారు.ఎన్నికల అధికారి జలాలొద్దీన్ అక్బర్ మాట్లాడుతూ, జిల్లా యూనియన్ అధ్యక్షుడిగా భాషవేణి మల్లేశం యాదవ్, ఉపాధ్యక్షుడిగా చిగుర్ల శ్రీనివాస్ కురుమ ఏకగ్రీవంగా ఎన్నికైనారని, డైరెక్టర్లుగా అగిత రవీందర్, కాల్వ సురేష్, చౌటపల్లి రంజిత్, జిల్లెల్ల పరశురాములు, దాడి ఆంజనేయులు, దాడి సదయ్య, దానే ఒదేలు, బండి మల్లయ్య, ముక్కెర సదానందం, సందవేణి ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు.ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో సుమారు 14 సంవత్సరాల క్రితం గొర్రెల పెంపకందారుల సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించగా, ప్రస్తుతం జిల్లాల పునర్విభజన అనంతరం కరీంనగర్ జిల్లాలో, జిల్లా యూనియన్ ఎన్నికలు నిర్వహించినట్లు తెలిపారు. జూలై 22న ఎన్నికల నోటిఫికేషన్ విడుదల చేయగా, జూలై 27 నుంచి 29 వరకు మూడు రోజుల పాటు నామినేషన్ల ప్రక్రియ కొనసాగిందన్నారు. మొత్తం 21 నామినేషన్లు దాఖలు కాగా, 9 మంది నామినేషన్లను ఉపసంహరించుకోవడంతో మిగిలిన 12 మంది ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు వివరించారు. అనంతరం వారితో ఎన్నికల అధికారి ప్రమాణ స్వీకారం చేయించారు.నూతనంగా ఎన్నికైన జిల్లా యూనియన్ అధ్యక్షుడు భాషవేణి మల్లేశం యాదవ్ మాట్లాడుతూ, తన ఎన్నికకు సహకరించిన జిల్లా ప్రాథమిక గొర్రెల పెంపకందారుల సహకార సంఘాల గ్రామ అధ్యక్షులకు, యాదవ, కురుమ సోదరులకు, కుల పెద్దలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గొర్రెల పెంపకందారుల సంక్షేమం కోసం అందరి సహకారంతో కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు.ఎన్నికల ప్రక్రియలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ వంశీకృష్ణ, సీనియర్ ఇన్‌స్పెక్టర్ సర్దార్ ప్రీత్‌పాల్ సింగ్ సహకార సంఘాల సభ్యులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా పశువైద్య , పశు సంవర్ధక అధికారి లింగా రెడ్డిని నూతన కమిటీ సభ్యులు, మరియు ఎన్నికల అధికారి మర్యాద పూర్వకంగా కలిసారు.

# వివో బిల్డింగ్‌ల నిర్మాణంపై దృష్టి సారించాలి..

## ఇందిరమ్మ ఇళ్ల ఫేజ్-1 పనులు త్వరగా పూర్తి చేయాలి..ఫేజ్-2 అమలుపై ప్రత్యేక దృష్టి..

## ఎంపీడీవోలు మిషన్ మోడ్‌లో పనిచేయాలి..

## జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా



**నవగీతం, కరీంనగర్ ప్రతినిధి:**జిల్లాలో వివో బిల్డింగ్‌ల నిర్మాణం, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, ఫామ్ పాండ్‌లు, వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం తదితర అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు.శనివారం రాత్రి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎంపీడీవోలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామాల్లో వివో బిల్డింగ్‌ల నిర్మాణానికి సంబంధించి ఉన్న భూ సమస్యలను తక్షణమే పరిష్కరించి నిర్మాణ పనులను వేగవంతం చేయాలని సూచించారు. ఇప్పటికే మంజూరైన బిల్డింగ్‌ల నిర్మాణాన్ని ఆలస్యం చేయకుండా పూర్తి చేయాలని, ఇంకా మంజూరు కాని చోట్ల వెంటనే ప్రతిపాదనలు పంపించి మంజూరు పొందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.
వివో బిల్డింగ్‌లకు స్థలాల కేటాయింపులో ఎలాంటి ఆటంకాలు లేకుండా ఎంపీడీవోలు, తహసీల్దార్లు ప్రత్యేక చొరవ తీసుకోవాలని, ఇందుకు పంచాయతీరాజ్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ఫేజ్-1 పనులను సత్వరమే పూర్తి చేసి, ఫేజ్-2 అమలు ప్రక్రియపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులకే పథకం ప్రయోజనాలు అందేలా చూడాలని, అనర్హులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఎంపిక చేయవద్దని స్పష్టం చేశారు. పూరి గుడిసెల్లో నివసిస్తున్న నిరుపేద కుటుంబాలను గుర్తించి, వారికి ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో ప్రత్యేక ప్రాధాన్యం కల్పించాలని ఆదేశించారు.
ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా ఎంపీడీవోలు మిషన్ మోడ్‌లో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. విధుల నిర్వహణలో అలసత్వానికి తావివ్వకుండా పారదర్శకంగా, నిజాయితీగా వ్యవహరించాలని తెలిపారు.గ్రామాల్లో వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం, ఫామ్ పాండ్‌ల నిర్మాణాన్ని వేగవంతం చేసి లక్ష్యాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.



ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, డీఆర్డీఓ గీత, డీపీఓ జగదీశ్వర్, జెడ్పీ డిప్యూటీ సీఈవో పవన్ కుమార్, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు, ఎంపీడీవోలు తదితరులు పాల్గొన్నారు.

# కొరుట్ల--మధాపూర్ ఎక్స్ రోడ్డుపై హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు

## ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ కృషి

**నవగీతం,(కోరుట్ల ప్రతినిధి)** కొరుట్ల నియోజకవర్గ ప్రజల రవాణా సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ నిరంతరం కృషి చేస్తున్నారు. కొరుట్ల--మధాపూర్ (కల్లూరు సర్వార్జపూర్)ఎక్స్ రోడ్డులో కిలోమీటర్ 6/4-6 వద్ద వర్షాకాలంలో వెంటెడ్ కాజ్‌వేపై వరద నీరు ప్రవహించడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అక్కడ హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి అవసరమైన ప్రతిపాదనలు వెంటనే ప్రభుత్వానికి పంపించాలని జిల్లా కలెక్టర్‌ను కొరినారు.ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ విజ్ఞప్తి మేరకు జిల్లా కలెక్టర్ రోడ్లు ు భవనాల శాఖ ప్రధాన కార్యదర్శికి అధికారికంగా లేఖ రాసి, సుమారు రూ.17 కోట్ల అంచనా వ్యయంతో హై లెవల్ బ్రిడ్జి నిర్మాణానికి పరిపాలనా అనుమతులు మంజూరు చేయాలని కోరారు. అలాగే ఈ ప్రతిపాదనలో ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ చేసిన విజ్ఞప్తిని ప్రత్యేకంగా ప్రస్తావిస్తూ, ఈ రహదారి చీఎ-63ను కొరుట్ల--రాయికల్ (కల్లూరు సర్వరాజపూర్) రహదారితో అనుసంధానించే కీలక మార్గమని పేర్కొన్నారు.కొరుట్ల నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన ప్రతి అంశంపై ప్రభుత్వం దృష్టి సారించేలా ఎమ్మెల్యే డా. కల్వకుంట్ల సంజయ్ నిరంతరం కృషి చేస్తున్నారని, ఈ హై లెవల్ బ్రిడ్జికి త్వరలోనే పరిపాలనా అనుమతులు లభించి నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.


# ఆగష్టు 7న బెంగళూరులో జరిగే ఓబీసీ 11వ మహాసభ ను విజయవంతం చేద్దాం



**నవగీతం, కరీంనగర్:** కరీంనగర్ పట్టణంలోని దుర్శేడ్ గ్రామంలో బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గ్రామపంచాయతీ కార్యాలయంల ముందు బీసీ మహిళ సంఘం జిల్లా అధ్యక్షురాలు దేవరకొండ సంతోషి లక్ష్మి మరియు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సాయిని తిరుపతి , బుర్ర హరీష్ గౌడ్ , ఆరవ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కపిల్ మాధవ్ , జిల్లా బీసీ సంఘం నాయకులు రాచమల్ల రాజు దొగ్గలి శ్రీధర్ కలసి ఆగస్టు 7న హలో బీసీ ఛలో బెంగుళూరులో జరిగే అఖిలభారత జాతీయ ఓబీసీ 11వ మహాసభలను విజయవంతం చేయాలని గోడ పత్రికలను ఆవిష్కరించారు. అనంతరం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు సాయిని తిరుపతి మాట్లాడుతూ ఆగస్టు 7న బెంగళూరులో నిర్వహించే అఖిలభారత జాతీయ ఓబీసీ 11వ మహా సభకు దేశవ్యాప్తంగా వేలాది మంది ఓబీసీ ప్రతినిధులు హాజరవుతున్న సభకు దేశవ్యాప్తంగా బీసీ కులగణన చేసి జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లు పెంచాలని బీసీలకు 50% రాజకీయ రిజర్వేషన్లను కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని సాయిని తిరుపతి డిమాండ్ చేశారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా ఉద్యమిస్తామని కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఆగస్టు 7న బెంగళూరులో జరిగే అఖిలభారత జాతీయ ఓబిసి 11వ మహాసభలను కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా బీసీ సంక్షేమ సంఘం జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ నాయకులతో పాటు మహిళా నాయకురాళ్ళు పెద్ద ఎత్తున తరలి వచ్చి ఓబీసీ మహాసభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో దుర్శేడ్ గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# అమ్మ పాలు అమృతం

## సర్పంచ్ కనుముల వెంకటేష్



నవగీతం, మల్లాపూర్: మల్లాపూర్ మండలంలోని వెంకట్రావుపేట గ్రామపంచాయతీ ఆవరణంలో అంగన్వా డి టీచర్స్ ఆధ్వర్యంలో ఆగస్టు మాసంలో ప్రతి ఏటా నిర్వహించే తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా తల్లిపాల వారోత్సవాలు ఘనంగా శనివారం నిర్వహించారు ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కనుముల వెంకటేష్ మాట్లాడుతూ శిశువు ఆరోగ్యకరమైన ఎదుగుదలకు రోగ నిరోధక శక్తి పెంపొందించడానికి తల్లిపాలు ఎంతగానో దోదపడతాయని అన్నారు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించి వివరించారు అనంతరం వచ్చిన గర్భిణీ స్త్రీలకు.బాలింతలకు బాలామృతం కోడిగుడ్లు నిత్యవసర వస్తువులు పంపిణీ చేశారు ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ తోట గంగారెడ్డి, పంచాయతీ కార్యదర్శి సురేష్, యం యల్ హెచ్ పి శైలజ ఏఎన్ఎం కోమల.అంగన్వాడి సంధ్యారాణి జమున పద్మావతి. ఆశా కార్యకర్తలు శారద రాణి పాలక వర్గ సభ్యులు గర్భిణులు బాలింతలు పిల్లలు ప్రజలు పాల్గొన్నారు

# పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోండి: సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్



**నవగీతం, మల్లాపూర్:** మల్లాపూర్ మేజర్ గ్రామ పంచాయతీ పాలకవర్గం ఆధ్వర్యంలో శనివారం గ్రామపంచాయతీ పరిసర ప్రాంతాల్లో ప్రజలందరికి అవగాహన కల్పిస్తూ నీరు నిలువ ఉన్న నీటి తొట్టెలను బోర్లించారు.ఈ సందర్భంగా మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మాట్లాడుతూ దోమల ద్వారా వచ్చే మలేరియా,డెంగ్యూ వంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి, పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి,కాచి వడపోసిన నీటిని తాగాలని అన్నారు.ఈ కార్యక్రమం లో ఉప సర్పంచ్ గడ్డం సోమరెడ్డి, పంచాయతీ కార్యదర్శి గూరుడు శ్రీనివాస్,మనోహర్ రెడ్డి, వార్డు సభ్యులు మహమ్మద్ షబ్బీర్, కొంపల్లి రాకేష్, భూక్య శేఖర్, అల్లె లత, కదుర్క లక్ష్మి,ఆశా కార్యకర్తలు,అంగన్వాడీ కార్యకర్తలు, మహిళా సమాఖ్య సభ్యురాళ్ళు, ఏనుగు వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నవగీతం తెలుగు దినపత్రిక
ఆదివారం
2 ఆగస్టు 2026

# బాలల రక్షణలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైనది

## జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎస్. శివకుమార్





**నవగీతం, కరీంనగర్ ప్రతినిధి:** పాఠశాల స్థాయిలో బాలల హక్కుల పరిరక్షణ, వారి భద్రత, సంక్షేమాన్ని నిర్ధారించడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమైనదని కరీంనగర్ జిల్లా ప్రధాన మరియు సెషన్స్ న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ శ్రీ ఎస్. శివకుమార్ గారు పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ (హైదరాబాద్) ఆదేశాల మేరకు "మిషన్ బాల సురక్ష, శిక్షా మరియు న్యాయ--2026" కార్యక్రమంలో భాగంగా జిల్లా కోర్టు ఆవరణలోని 'న్యాయ సేవా సదన్'లో పాఠశాలల చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులుగా నియామకమైన ఉపాధ్యాయులకు ఒకరోజు ప్రత్యేక అవగాహన (సెన్సిటైజేషన్) శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీ ఎస్. శివకుమార్ జ్యోతిప్రజ్వలన చేసి శిక్షణను ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులకు నిరంతరం అందుబాటులో ఉండే ఉపాధ్యాయులు, పిల్లల్లో వచ్చే మార్పులను, వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించగలరని అన్నారు. బాలలపై వేధింపులు, లైంగిక దాడులు (పోక్సో చట్టం), బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ వంటి సామాజిక అన్యాయాల నివారణకు ఉపాధ్యాయులు చట్టపరమైన అవగాహన కలిగి ఉండటం అత్యంత ఆవశ్యకమని ఆయన స్పష్టం చేశారు. పాఠశాలల్లో భయరహిత, సురక్షితమైన వాతావరణాన్ని కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఇన్చార్జి కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి శ్రీమతి కే. రాణి గారి ఆధ్వర్యంలో, జిల్లా విద్యాశాఖ సమన్వయంతో జరిగిన ఈ శిక్షణలో వివిధ రకాల చట్టాలపై న్యాయమూర్తులు, నిపుణులు సమగ్ర అవగాహన కల్పించారు. బాలలకు అందుబాటులో ఉన్న ఉచిత న్యాయ సేవలు, బాలల హక్కుల ఉల్లంఘన జరిగినప్పుడు సంబంధిత శాఖలతో (పోలీస్, ఉమెన్ ౘ చైల్డ్ వెల్ఫేర్, చైల్డ్ లైన్ 1098) సమన్వయం చేసుకుంటూ తీసుకోవాల్సిన విధివిధానాలను ఉపాధ్యాయులకు క్షుణ్ణంగా వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో మొదటి అదనపు జిల్లా మరియు సెషన్స్ న్యాయమూర్తి శ్రీ డి. వెంకటేష్ గారు, ఏసిబి కోర్ట్ న్యాయమూర్తి నామ సంతోష్ కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు గడ్డం లక్ష్మణ్, రిసోర్స్ పర్సన్ లు, డిప్యూటీ, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ కే. ప్రసాద్, రఫీ, గాలిపల్లి నాగేశ్వర్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, ఏ. కిరణ్ కుమార్, ఏ. సంతోష్ కుమార్, ఏ. స్వప్న, పర్వీన్, చిట్టి చంద్రప్రకాష్ రెడ్డి, పెరుక రంగయ్య, జిల్లాలోని వివిధ పాఠశాలల నుండి హాజరైన చైల్డ్ ప్రొటెక్షన్ అధికారులు (ఉపాధ్యాయులు), న్యాయాధికారులు, న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# వాజేడు మండలంలో పర్యటించిన మంత్రి సీతక్క.

## గోదావరి శాంతించాలని ప్రత్యేక పూజలు.





**నవగీతం( ములుగు జిల్లా ప్రతినిధి)** ములుగు జిల్లాలోని పలు ముంపు ప్రాంతాల గ్రామాలతో పాటు శనివారం వాజేడు మండలంలో పర్యటించారు. ఈ సందర్భంగా గోదావరి వరద శాంతించాలని గోదావరికి రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) శాంతి పూజలు నిర్వంచారు. అనంతరం గత రెండు రోజుల క్రితం షార్ట్ సర్క్యూట్ తో ఇల్లు దగ్ధమైన చెన్నం రాజువద్దకు చేరుకొని ఇరువై వేల రూపాయల ఆర్థిక సహాయం అందజేశారు. అనంతరం గతవారం క్రితం వాజేడు మండల కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దంతులూరి విశ్వనాథ ప్రసాద్ బాబు రాజు అకాల మరణం చెందిన సంగతి పాఠకులకు తెలిసినదే.. వారి కుటుంబ సభ్యులను కలిసి మంత్రి సీతక్క పరమార్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. తదనంతరం చీకుపల్లి ఇసుక వాగు పై ముంపును పరిశీలించి తగిన జాగ్రత్త చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ యొక్క పర్యటనలో భాగంగా ములుగు జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, ములుగు జిల్లా ఎస్పీ, సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పిఓ. లెనిన్ వస్సల్ టోప్పో మరియు మండల అధికారులు నాయకులు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# గోదావరి పరివాహక ప్రజలకి శాశ్వత రక్షణ కల్పిస్తాం.

## లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తాం.

రాష్ట్ర మంత్రి దనసరి అనసూయ (సీతక్క).





**నవగీతం న్యూస్.(ములుగు జిల్లా ప్రతినిధి)** ములుగు జిల్లాలోనీ గోదావరి వరదకు నీట మునిగిన పలు మండలాలకు చెందిన గ్రామాలలో శనివారం రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి,స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ (సీతక్క) మరియు ములుగు జిల్లా కలెక్టర్, ములుగు జిల్లా ఎస్పీ, మరియు ఐ.టి.డి.ఏ. పి ఓ, పర్యటించారు. మొదటిగా ఏటూరు నాగారం మండలం లోని రామన్నగూడెం గోదావరి పుష్కర ఘాట్ వద్దకు వెళ్ళి గోదావరి ప్రవాహాన్ని పరిశీలించారు. అనంతరం మంత్రి సీతక్క మాట్లాడుతూ గత రెండు రోజులుగా ఛత్తీస్గఢ్, మహారాష్ట్ర లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా భారీ వరదలు వస్తున్నాయని, దీనిగురించి జిల్లా యంత్రాంగం పూర్తి స్థాయిలో అప్రమత్తమై పని చేస్తుందని తెలిపారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ఎప్పటికప్పుడు పరిస్థితులను పర్యవేక్షిస్తున్నామని అన్నారు. గత రెండేళ్లుగా ప్రత్యేక వరద నిర్మూలన కమిటీ వేసి వాగులు, గోదావరి పరివాహక ప్రాంతాలలో, ముంపు గ్రామాల్లో ప్రత్యేక అధికారులను నియమించి పరిస్థితులను నిరంతరం పరిశీలిస్తున్నామని తెలిపారు. గోదావరి మూడో ప్రమాద హెచ్చరిక చేరినప్పటికీ ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవడం వలన ఎటువంటి నష్టం జరగలేదని తెలిపారు. రెండు నెలల క్రితమే గోదావరి పరివాహక ప్రాంతాలలో ఉన్నత అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి పర్యటించి అవసరమైన జాగ్రత్తలు తీసుకున్నామని అన్నారు. గతంలో రామన్నగూడెం లోకి వరద నీరు చేరేదని ఈసారి ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవడం వలన వరద ను నివారించగలిగామని పేర్కొన్నారు .రామన్నగూడెం, మంగపేట ప్రాంతాలలో ఇప్పటికే కరకట్ట పనులు ప్రారంభం అయ్యాయని, సుమారు 800మీటర్ల మేర కరకట్ట పనులు పూర్తి అయ్యాయని వివరించారు. ప్రజలు వాగులు, వరదలు ఉప్పొంగిన సమయంలో దాటే ప్రయత్నం చేయకూడదని విజ్ఞప్తి చేశారు. భారీ వర్షాలు కురిసే సమయంలో చేపల వేటకు వెళ్ళడం కానీ,అడవుల్లోకి పశువుల కాపర్లు పశువులను మేత కి తీసుకువెళ్లడం ప్రమాదకరమని హెచ్చరించారు. 2022,2023, సంవత్సరాలలో గోదావరి, జంపన్న వాగు వరదల వల్ల కలిగిన నష్టాన్ని దృష్టిలో ఉంచుకొని మిగిలిన కరకట్ట పనులు కూడా పూర్తి చేసి గోదావరి పరివాహక ప్రజలకి శాశ్వత రక్షణ కల్పిస్తామని తెలిపారు. అదేవిధంగా లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలకి పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని వెల్లడించారు. ఈయొక్క పర్యటనలో భాగంగా ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవ్ రావు, ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐ.టి.డి.ఏ.పి.ఓ.లెనిన్ వస్సల్ టోప్పోమరియు స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

# హెచ్ఐవి నివారణ, నియంత్రణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలి

స్క్రీనింగ్ క్యాంపులు విస్తృతంగా నిర్వహించాలి.. బాధితుల పట్ల వివక్ష చూపరాదు.. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా




**నవగీతం,కరీంనగర్ ప్రతినిధి:** జిల్లాలో హెచ్ఐవి/ఎయిడ్స్ నివారణ, నియంత్రణకు అన్ని శాఖలు సమన్వయంతో పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం రాత్రి కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎయిడ్స్ నివారణ మరియు నియంత్రణ కమిటీ తొలి సమావేశానికి కలెక్టర్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జిల్లాలో హెచ్ఐవి/ఎయిడ్స్ నియంత్రణ చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లావ్యాప్తంగా డ్రై మోడల్లో వెల్నెస్ స్క్రీనింగ్ క్యాంపులను విస్తృతంగా నిర్వహించాలని సూచించారు. అధిక ప్రమాదం ఉన్న ప్రాంతాలు, హాట్స్పాట్ కేంద్రాలను గుర్తించి ప్రత్యేక స్క్రీనింగ్ కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. హెచ్ఐవి బాధితుల పట్ల ఎలాంటి వివక్ష చూపకుండా అవసరమైన వైద్య సేవలు, ఇతర సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ప్రజలకు సులభంగా అర్థమయ్యే భాషలో ఐఈసీ (×జుజ) ప్రచార సామగ్రిని అందుబాటులో ఉంచడంతో పాటు, 1097 టోల్ఫ్రీ హెల్ప్లైన్ గురించి విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. హెచ్ఐవి వ్యాధిపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, ముందస్తు పరీక్షలు, చికిత్స సేవలను మరింత బలోపేతం చేయడం ద్వారా వ్యాధి వ్యాప్తిని అరికట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాజగోపాలరావు, జడ్పీ డిప్యూటీ సీఈవో పవన్ కుమార్, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, అడిషనల్ డీఎంఅండ్హెచ్ఓ సుధా, డీఏపీసీయూ డీపీఎం సురేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ఆర్ఎంఓ నవీనా వైద్యాధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రాఘవపేట గ్రామ సభలో గ్రామాభివృద్ధి ప్రణాళికలపై చర్చ



**నవగీతం, మల్లాపూర్**: గ్రామాభివృద్ధికి ప్రజల భాగస్వామ్యంతో కూడిన ప్రణాళికలను రూపొందించేందుకు గ్రామ పంచాయతీ డెవలప్మెంట్ ప్లాన్ పై రాఘవపేట గ్రామ సర్పంచ్ తోట శ్రీనివాస్ అధ్యక్షతన గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ తోట శ్రీనివాస్ మాట్లాడుతూ గ్రామంలో మంచినీటి సరఫరా, రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ, పారిశుద్ధ్యం, వీధి దీపాల నిర్వహణతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలుపై గ్రామ ప్రజల నుంచి సూచనలు, అభిప్రాయాలు, సమస్యలను తెలుసుకున్నారు. అదేవిధంగా వర్షాభావ పరిస్థితులు, ఎల్-నినో ప్రభావం వల్ల ఏర్పడే నీటి కొరతపై గ్రామస్తులతో చర్చించి, వ్యవసాయం మరియు తాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాల్సిన అవసరాన్ని వివరించారు. నీటి పొదుపు, వర్షపు నీటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. వర్షాకాలంలో దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా, కలరా వంటి వ్యాధుల నివారణకు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వేడి ఆహారాన్ని తీసుకోవాలని ప్రజలకు ఆరోగ్య సూచనలు చేశారు. గ్రామాభివృద్ధికి ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని సర్పంచ్ పేర్కొన్నారు. ఈ గ్రామ సభలో ఉపసర్పంచ్ మద్దెల నర్సయ్య, పంచాయతీ కార్యదర్శి మోహన్ నాయక్, వార్డు సభ్యులు ఇడగొట్టి లస్మయ్య, అమీనొద్దీన్, మాధం సాగర్, మామిడి లక్ష్మీ నర్సయ్య, చిట్యాల సుశీల నర్సయ్య, రాంతో పాటు వ్యవసాయ, ఆరోగ్య, విద్య, విద్యుత్, అంగన్వాడీ శాఖల అధికారులు, నాయకులు కిరణ్, బండి కమలాకర్, రాజు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మల్లాపూర్లో మహిళా గ్రామసభ నిర్వహణ




**నవగీతం,మల్లాపూర్:** మల్లాపూర్ మండల కేంద్రంలో శనివారం మహిళా గ్రామసభను ఘనంగా నిర్వహించారు. గ్రామ పంచాయతీ ఆవరణలో మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ చిట్యాల లక్ష్మణ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో మహిళల సంక్షేమం, భద్రత, విద్య, ఆరోగ్యం, ఆర్థిక సాధికారత తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా గ్రామాభివృద్ధిలో మహిళల భాగస్వామ్యం కీలకమని, మహిళల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి గ్రామ పంచాయతీ కట్టుబడి పనిచేస్తుందని సర్పంచ్ తెలిపారు. మహిళల స్వయం ఉపాధి, ఆరోగ్య పరిరక్షణ, బాలికల విద్యాభివృద్ధి, మహిళల భద్రతపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ గడ్డం సోమరెడ్డి, గ్రామ పంచాయతీ కార్యదర్శి గూరుడు శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ మనోహర్ రెడ్డి, వార్డు సభ్యురాళ్లు అల్లె లత, కదుర్క లక్ష్మి, మహమ్మద్ షబ్బీర్, కొంపల్లి రాకేష్, భుక్యా శేఖర్, అంగన్వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, మహిళా సమాఖ్య సంఘ సభ్యులు, ఏవీఆర్ గ్రామ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగును విస్తరించాలి..

రైతులను చైతన్యపరచడంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలి..

జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా






**నవగీతం,కరీంనగర్ ప్రతినిధి**: జిల్లాలో తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటల విస్తరణకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం రాత్రి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో ఎంపీడీవోలు, తహసీల్దార్లు, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు సమన్వయంతో పనిచేసి ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులను ఒప్పించాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామాల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, తక్కువ నీటితో అధిక లాభదాయకమైన పంటల సాగుపై రైతులను ప్రోత్సహించాలని తెలిపారు. ప్రతి మండలంలో గత ఏడాది సాగైన పంటలు, ఈ ఏడాది సాగు ప్రతిపాదనలు, ఆరుతడి పంటల విస్తీర్ణంపై మండలాల వారీగా సమీక్ష నిర్వహించారు. కందులు, పెసలు, సన్ఫ్లవర్, కూరగాయలు, పూల సాగు, పప్పుధాన్యాలు, పండ్ల తోటలు, ఆయిల్పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగును పెంచేలా రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు.

ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధనకు వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామాల వారీగా ఆరుతడి, ప్రత్యామ్నాయ, సేంద్రీయ పంటల సాగుపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, డీఆర్డీఓ, జడ్పీ డిప్యూటీ సీఈవో పవన్ కుమార్, ఏడీఏలు, మండల వ్యవసాయ అధికారులు, ఎంపీడీవోలు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# శారీరక దృఢత్వం పోలీసింగ్‌కు పునాది

ప్రజాసేవలో ఉత్తమ ఫలితాలకు క్రమశిక్షణ తప్పనిసరి
అంకితభావంతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి
వారాంతపు కవాతుకు హాజరైన జిల్లా ఎస్పీ డి.జానకి,



**మహబూబ్ నగర్** జిల్లా పోలీసు సిబ్బంది ఎల్లప్పుడూ శారీరకంగా దృఢంగా, మానసికంగా అప్రమత్తంగా ఉండి క్రమశిక్షణతో విధులు నిర్వహించాలని జిల్లా ఎస్పీ జానకి, సూచించారు. శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం కవాతు మైదానంలో నిర్వహించిన వారాంతపు కవాతుకు జిల్లా ఎస్పీ హాజరై పరేడ్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా కవాతులో పాల్గొన్న అధికారులు, పోలీసు సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడారు. పోలీసు విధులు అత్యంత బాధ్యతాయుత మైనవని, వాటిని సమర్థవంతంగా నిర్వర్తించేందుకు శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, అప్రమత్తత అత్యంత అవసరమని ఎస్పీ తెలిపారు. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది ప్రతిరోజూ వ్యాయామం, పరేడ్, ఫిట్‌నెస్ కార్యక్రమాల్లో క్రమం తప్పకుండా పాల్గొని తమ శారీరక సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ప్రజలకు మెరుగైన, నాణ్యమైన పోలీసు సేవలు అందించాలంటే శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక దృఢత్వం కూడా ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. విధుల నిర్వహణలో సమయపాలన, అంకితభావం, నిజాయితీ, క్రమశిక్షణను పాటిస్తూ ప్రజలతో స్నేహపూర్వకంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి పోలీసు సిబ్బంది తమ సేవల ద్వారా శాఖ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎన్.బి.రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణా రెడ్డి, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పయ్య, ఆర్‌ఐలు కృష్ణయ్య, నగేష్, అశోక్ కుమార్, రూరల్ సబ్‌ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్‌తో పాటు ఇతర అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రమాదవశాత్తు మున్సిపల్ కార్మికుడి మృతి:

కుటుంబానికి మున్సిపల్ చైర్మన్ రూ. 10,000 ఆర్థిక సాయం?



**నవగీతం,మెట్ పల్లి ప్రతినిధి:** మెట్‌పల్లి పురపాలక సంఘంలో పారిశుధ్య కార్మికునిగా సేవలందిస్తున్న కాంపెల్లి పోచయ్య (57) శనివారం ప్రమాదవశాత్తు కోనేరులో పడి మరణించడం అత్యంత విచారకరమని మున్సిపల్ చైర్మన్ మైలారం లింబాద్రి పేర్కొన్నారు.?మృతుని నిరుపేద కుటుంబ పరిస్థితిని గమనించి, మానవతా దృక్పథంతో చైర్మన్ మైలారం లింబాద్రి తన సొంత నిధుల నుంచి రూ. 10,000 ఆర్థిక సహాయాన్ని మృతుడి భార్య లక్ష్మికి శనివారం అందజేశారు. పోచయ్య అకాల మరణం మున్సిపల్ సిబ్బందికి, ఆయన కుటుంబానికి తీరని లోటని ఆయన సంతాపాన్ని ప్రకటించారు.?ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఓంకార్ నవీన్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ గౌడ్, కౌన్సిలర్లు గుడికందుల అజయ్, బోడ్ల ఆనంద్, ఆర్య వైశ్య సంఘం అధ్యక్షులు మైలారపు రాంబాబు, నాయకులు బర్ల సూరి, పుడుకారం కిషోర్, మరియు మున్సిపల్ అధికారులు, సిబ్బంది మరియు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

# తన్నీరు వర్సెస్ కల్వకుంట్ల చాపకింద నీరులా పోరు



**మెదక్ :** సిద్ధిపేట జిల్లాలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ లీడర్ తన్నీరు హరీశ్ రావు నిర్వహించిన పాదయాత్ర గులాబీ పార్టీ శ్రేణుల్లో సరికొత్త ఉత్సాహాన్ని నింపడంతో పాటు రాష్ట్ర రాజకీయాల్లో అనూహ్య చర్చకు తెరలేపింది. రైతాంగ సమస్యలు, కాళేశ్వరం ప్రాజెక్టు నీటి విడుదల డిమాండ్‌తో హరీశ్ రావు చేపట్టిన ఈ యాత్రకు క్షేత్రస్థాయిలో ప్రజలు, రైతుల నుంచి విశేష స్పందన లభించింది. కేవలం నియోజకవర్గ లేదా జిల్లా స్థాయి నిరసనగా కాకుండా, ఒక బహుళ ప్రజా ఉద్యమంగా ఈ యాత్ర రూపాంతరం చెందడంతో రాష్ట్రవ్యాప్తంగా హరీశ్ రావు పాదయాత్ర చేపడితే పార్టీకి పూర్వవైభవం సాధించడం తేలికవుతుందనే అభిప్రాయాలు బీఆర్ఎస్ వర్గాల్లో బలపడుతున్నాయి.అయితే, ప్రతిపక్షంలో ఉన్న బీఆర్ఎస్‌ను మళ్లీ అధికార దిశగా నడిపించేందుకు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాష్ట్రస్థాయి యాత్రలు, సభల బాధ్యతలను తన భుజస్కంధాలపై వేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఒత్తిడి పెంచేందుకు కేటీఆర్ నేతృత్వంలోనే కార్యక్రమాలు చేపట్టాలని హైకమాండ్ భావిస్తున్న తరుణంలో, క్షేత్రస్థాయి కేడర్ మాత్రం మాస్ కనెక్టివిటీ ఉన్న హరీశ్ రావు వైపే ఎక్కువగా మొగ్గుచూపుతున్నట్లు కనిపిస్తోంది. పల్లెల్లో రైతులు, సామాన్య ప్రజలతో కలిసిపోయే నైజం, సుదీర్ఘమైన సంక్షోభ నిర్వహణ అనుభవం ఉన్న హరీశ్ రావు అయితేనే కాంగ్రెస్ వైఫల్యాలను జనంలోకి బలంగా తీసుకెళ్లగలరనే వాదన గులాబీ శ్రేణుల్లో విపరీతంగా పెరిగింది.ఈ భిన్నమైన అభిప్రాయాలు బీఆర్ఎస్ లోపల ఏమైనా అంతర్గత సంక్షోభాన్ని కాకపోయినా నాయకత్వ సవాలు గా చూడవచ్చు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచీ కేటీఆర్ గ్రామీణ, పట్టణ డిజిటల్ నెట్‌వర్కింగ్, నేషనల్ అప్పీల్‌తో కార్పొరేట్ లుక్‌ను ప్రతిబింబిస్తే, హరీశ్ రావు పక్కా తెలంగాణ మాస్, అగ్రికల్చర్, గ్రౌండ్-లెవల్ ఆర్గనైజేషనల్ పవర్‌కు కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సోషల్ మీడియా బిల్డప్‌ల కంటే భౌతికంగా జనంలో తిరిగే నాయకుడికే ఎక్కువ ఆదరణ ఉంటుంది కాబట్టి, సహజంగానే హరీశ్ రావు గ్రాఫ్ పార్టీ శ్రేణుల్లో పైచేయి సాధిస్తోంది. కేసీఆర్ క్రియాశీల రాజకీయాలకు కొంత దూరంగా ఉంటూ ఫామ్‌హౌస్‌కే పరిమితమైన ప్రస్తుత వాతావరణంలో, పార్టీకి అధిపతి ఎవరు అనే దానిపై ద్వితీయ శ్రేణి నాయకత్వంలో గందరగోళం నెలకొంది. కేటీఆర్‌ను తదుపరి వారసుడిగా ప్రాజెక్ట్ చేసే క్రమంలో హరీశ్ రావు పాత్రను కేవలం సిద్ధిపేట లేదా ఉమ్మడి మెదక్ జిల్లా పరిధికే పరిమితం చేస్తున్నారనే అసంతృప్తి హరీశ్ మద్దతుదారుల్లో చాలా కాలంగా ఉంది. ఇప్పుడు సిద్ధిపేట పాదయాత్ర సక్సెస్ కావడంతో.. హరీశ్ రావుకు రాష్ట్రస్థాయిలో స్వేచ్ఛనిస్తే కేటీఆర్ ప్రాబల్యం తగ్గుతుందనే ముందస్తు వ్యూహంతోనే ఆయనను మిగతా జిల్లాల్లో పాదయాత్రలకు అనుమతించడం లేదనే ఆరోపణలు విపక్షాల నుంచి రాష్ట్రంలో అధికార కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి మార్క్ అగ్రెసివ్ రాజకీయాన్ని ఎదుర్కోవాలంటే కేవలం హైదరాబాద్ వేదికగా చేసే ప్రెస్ మీట్లు, ట్విట్టర్ వార్లతో సాధ్యం కాదని బీఆర్ఎస్ శ్రేణులు గుర్తించాయి. ఈ క్రమంలోనే ధర్నా చౌక్‌లు, ప్రాజెక్టుల సందర్శన, పొలాల బాట పట్టే విషయంలో హరీశ్ రావు చూపిస్తున్న చొరవను పార్టీ శ్రేణులు స్వాగతిస్తున్నాయి. ఈ పరిణామాలు బీఆర్ఎస్‌లో ప్రత్యక్ష చీలికకు దారితీయకపోయినా, అధికారికంగా పార్టీని నడిపిస్తున్న వర్గానికి, క్షేత్రస్థాయి బలమున్న హరీశ్ వర్గానికి మధ్య ఒక రకమైన సైలెంట్ పవర్ స్ట్రగుల్ నడుస్తోందనడానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. కేసీఆర్ స్పందించి కేటీఆర్, హరీశ్ రావుల మధ్య స్పష్టమైన బాధ్యతల విభజన చేయకపోతే ఈ నెరేటివ్ పార్టీకి తీవ్ర నష్టం చేకూర్చే అవకాశం ఉంది. ఒకరికి గ్రేటర్ హైదరాబాద్, అర్బన్ నియోజకవర్గాలు, మరొకరికి రూరల్ తెలంగాణ, రైతు పోరాటాల బాధ్యతలు అప్పగించాలన్న సూచనలు కూడా పార్టీ పెద్దలకు అందుతున్నాయి.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని కలిసి ధన్యవాదాలు తెలిపిన మంత్రి పొన్నం ప్రభాకర్



**నవగీతం, కరీంనగర్ ప్రతినిధి:** గౌరవెల్లి ప్రాజెక్టుతో పాటు పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్ ప్రాజెక్టులకు గతంలో మంజూరైన పర్యావరణ అనుమతులను కొనసాగిస్తూ సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పట్ల రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి ని ఆయన నివాసంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ, తెలంగాణ ప్రజల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని ముఖ్యమంత్రి కేంద్ర ప్రభుత్వం తో సంప్రదింపులు జరుపుతూ , అభిషేక్ సింగ్వి లాంటి మంచి న్యాయవాదులను నియమించి సుప్రీంకోర్టు లో న్యాయపరంగా సమర్థవంతంగా పోరాడిన ఫలితంగానే ఈ తీర్పు వచ్చిందన్నారు. గౌరవెల్లి, పాలమూరు-రంగారెడ్డి, సీతమ్మ సాగర్ వంటి కీలక సాగునీటి ప్రాజెక్టులకు ఈ తీర్పు కొత్త ఊపునిస్తుందని పేర్కొన్నారు.ఈ ప్రాజెక్టులు పూర్తయితే లక్షల ఎకరాలకు సాగునీరు అందడంతో పాటు తాగునీటి అవసరాలు కూడా తీరనున్నాయని, రైతులకు, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఇవి ఎంతో దోహదపడతాయని మంత్రి తెలిపారు.తెలంగాణ హక్కులను పరిరక్షించడంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న చొరవ, ప్రభుత్వం చేసిన న్యాయపోరాటం రాష్ట్ర ప్రయోజనాలను కాపాడిందని మంత్రి పొన్నం ప్రభాకర్ అభినందించారు.

## వరద కాలువకు నీరు విడుదల

ధన్యవాదాలు తెలిపిన రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



**నవగీతం, వేములవాడ,:**వేములవాడ నియోజకవర్గ పరిధిలోని మేడిపల్లి,భీమారం, కథలాపూర్ మండలాతో పాటు బాల్కొండ నియోజకవర్గనికి, చుట్టు పక్కల ప్రాంతాలకు ఉపయోగ పడే వరద కాల్వకు 1 టిఎంసి నీరు విడుదల చేయాలని శుక్రవారం రాత్రి మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి ని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ని కోరడం జరిగింది..వెంటనే స్పందించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వరద కాల్వకు ఎల్లంపల్లి నీటిని విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు .అధికారులు నిన్న రాత్రి విద్యుత్ అధికారుల సమన్వయంతో శనివారం ఉదయం ఎల్లంపల్లి నీటిని రాంపూర్ పంపు హౌస్ ద్వారా విడుదల చేయడం జరిగింది..వరద కాల్వకు నీరు విడుదల చేయడం ద్వారా కాల్వలో నీరు ఉండి భూగర్భ జలాలు పెరగడానికి ఆస్కారం ఉంది.కాగా నీరు విడుదల చేయడం పట్ల మంత్రివర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి కి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ధన్యవాదాలు తెలియజేశారు..

# విజన్ ఎడ్యుకేషన్ అడుగులు




**హైదరాబాద్ :** తెలంగాణ విద్యావ్యవస్థలో నూతన అధ్యాయాన్ని లిఖించబోతున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇటీవల ఫిన్లాండ్, జర్మనీ దేశాల్లో పర్యటించి వచ్చిన ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా విద్యావ్యవస్థపై తన విజన్ ను ఆవిష్కరించారు. విద్యారంగ సమగ్ర స్వరూపాన్ని మార్చేందుకు తన వద్ద ఉన్న కార్యాచరణను స్పష్టంగా వివరించారు. ఓటు బ్యాంకు రాజకీయాలకు అతీతంగా, రాబోయే తరాల భవిష్యత్తే ధ్యేయంగా పనిచేస్తానని ఆయన నొక్కి చెప్పారు.గత పాలకులు ఇరిగేషన్ శాఖను తమ వద్ద ఉంచుకుని, వేల పుస్తకాలు చదివామని గొప్పలు చెప్పుకుంటూ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందన్నారు రేవంత్ రెడ్డి. కానీ నేను మాత్రం ఓట్లు లేని, కేవలం బాధ్యత మాత్రమే ఉన్న విద్యాశాఖను తన వద్దే ఉంచుకున్నానని పరోక్షంగా విపక్షాలకు కౌంటర్ ఇచ్చారు. తానెలాంటి తప్పులు చేయలేదని, ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు వివాదాల్లేకుండా పూర్తి చేశానని గుర్తుచేశారు. గడిచిన నాలుగేళ్లుగా ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని, తెలంగాణ విద్యా వ్యవస్థ 28వ స్థానం నుండి 18వ స్థానానికి చేరుకుందని గణాంకాలతో సహా వెల్లడించారు.ప్రైవేట్ పాఠశాలల్లో తల్లిదండ్రులు రూ.50 వేలకు మించి ఖర్చు చేయడం లేదని, కానీ ప్రభుత్వం ఒక్కో విద్యార్థిపై రూ.1.08 లక్షలు వెచ్చిస్తోందని సీఎం స్పష్టం చేశారు. బడ్జెట్‌లో విద్యకు 9 శాతం నిధులు కేటాయిస్తున్నప్పటికీ, నాణ్యతా ప్రమాణాల్లో ప్రపంచంతో పోటీ పడటంలో మనం ఎక్కడో వెనుకబడి ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజనీరింగ్ పూర్తయినా కనీసం ఉద్యోగానికి దరఖాస్తు కూడా రాయలేని పరిస్థితి మారి తీరాలని ఉద్ఘాటించారు. ఐటీఐలను ఏటీసీలుగా మార్చడమే కాకుండా, విదేశీ పర్యటనలకు ప్రతి ఏటా ఉపాధ్యాయులను పంపి గ్లోబల్ ఎడ్యుకేషన్‌ను ఇక్కడ అమలు చేస్తామన్నారు.తనకు ఎలాంటి ఇతర కోరికలు లేవని, 2034 వరకు తానే ముఖ్యమంత్రిగా ఉంటానని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఇందులో మీకేమీ అనుమానాలు అక్కర్లేదన్నారు. నల్గొండ వంటి ప్రాంతాల్లో 9 మంది ఉపాధ్యాయులున్నా ఒక్క విద్యార్థి కూడా లేని పాఠశాలల పరిస్థితిని నిరసించారు. బదిలీలు చేస్తే ధర్నాలు చేయడం సరికాదన్నారు. “మీ సమస్యలు నాకు వదిలేయండి.. ట్రాన్స్‌ఫర్లు, ప్రమోషన్లు మీ ఇంటికే వస్తాయి. కానీ ఐదేళ్ల పాటు పిల్లల భవిష్యత్తు కోసం నా దారిలోకి వచ్చి పోరాడండి. మండలాల వారీగా క్లస్టర్లను ఏర్పాటు చేసి, పాఠశాలల అభివృద్ధికి మీరే నివేదికలు ఇవ్వండి, వాటిని అమలు చేసే బాధ్యత నాది” అని పిలుపునిచ్చారు.హాస్టల్ సంస్కృతి వల్ల పిల్లలు ఒంటరితనానికి గురై, భవిష్యత్తులో తల్లిదండ్రులను ఓల్డేజ్ హోమ్‌లలో వేసే పరిస్థితి వస్తోందని రేవంత్ రెడ్డి మానవీయ కోణాన్ని స్పృశించారు. టీచర్లు కేవలం బోధకులుగా కాకుండా తల్లిదండ్రుల స్థానంలో ఉండి గైడ్ చేయాలని కోరారు. భాష అనేది కేవలం కమ్యూనికేషన్ సాధనమేనని, జర్మనీ, జపాన్ లాంటి దేశాలపై దృష్టి సారించి నైపుణ్యాలను పెంపొందించుకోవాలని సూచించారు. “ప్రభుత్వ బడిలో చదివితే ఏమవుతావని ఎవరైనా అడిగితే.. తెలంగాణ సీఎం అవుతానని గర్వంగా చెప్పండి” అని వ్యాఖ్యానించి ఉపాధ్యాయుల్లో, విద్యార్థుల్లో సరికొత్త ఆత్మవిశ్వాసాన్ని నింపారు.

నవగీతం
తెలుగు దినపత్రిక
ఆదివారం 2 ఆగస్టు 2026





# అనుపమ, తరుణ్ భాస్కర్‌ల 'క్రేజీ కళ్యాణం' టీజర్ రిలీజ్!

యువ నటి అనుపమ పరమేశ్వరన్, నటుడు, దర్శకుడు తరుణ్ భాస్కర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న తాజా చిత్రం 'క్రేజీ కళ్యాణం'. అఖిల్ రాజ్, సీనియర్ నటుడు నరేష్ వీకే తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్న ఈ సినిమాకు బద్రప్ప గాజుల దర్శకత్వం వహిస్తుండగా, బూసమ్ జగన్ మోహన్‌రెడ్డి అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. తాజాగా ఈ చిత్రానికి సంబంధించిన టీజర్ శనివారం ప్రేక్షకుల ముందుకు వచ్చి సోషల్ మీడియాలో విపరీతమైన క్రేజ్ సంపాదించుకుంటోంది. పెళ్లి వేడుకల నేపథ్యంలో సాగే ఆసక్తికరమైన సంఘటనలతో, పూర్తిగా నవ్వులు పంచే ఎంటర్‌టైనర్‌గా ఈ చిత్రాన్ని దర్శకుడు తీర్చిదిద్దినట్లు టీజర్ చూస్తే స్పష్టంగా అర్థమవుతుంది. పెళ్లి అనగానే వచ్చే సందడి, ఆ వెనుక జరిగే సరదా గొడవలు, అనుపమ మరియు తరుణ్ భాస్కర్ ల మధ్య వచ్చే కామిక్ టైమింగ్ ప్రేక్షకులను కడుపుబ్బా నవ్విస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. నరేష్ వీకే మరియు అఖిల్ రాజ్ పాత్రలు ఈ కథకు మరింత బలాన్ని చేకూరుస్తున్నట్లు టీజర్ ద్వారా తెలుస్తోంది. ఈ సినిమాలోని వినోదాత్మక సన్నివేశాలకు తగ్గట్టుగానే ప్రముఖ సంగీత దర్శకుడు సురేశ్ బొబ్బిలి అదిరిపోయే బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ అందించారు. టీజర్ లోని ప్రతీ డైలాగ్ మరియు విజువల్స్ సినిమాపై అంచనాలను ఒక్కసారిగా పెంచేశాయి. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని అప్డేట్స్ తో పాటు సినిమా రిలీజ్ డేట్ ను కూడా మేకర్స్ అధికారికంగా ప్రకటించనున్నారు.

# మహేష్ బర్త్‌డే కౌంట్‌డౌన్ మొదలు..

## 'వారణాసి' నుంచి స్పెషల్ ట్రీట్ ఉంటుందా, ఫ్యాన్స్‌లో ఉత్కంఠ!

సూపర్ స్టార్ మహేష్ బాబు అభిమానులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూసే నెల ఆగస్టు వచ్చేసింది. ప్రతి ఏడాది ఆగస్టు 9న మహేష్ పుట్టినరోజు సందర్భంగా సోషల్ మీడియాలో భారీ స్థాయిలో సందడి నెలకొంటుంది. ఈసారి కూడా అభిమానులు ఎస్ఎస్ఎంబీ మంత్ పేరుతో సెలబ్రేషన్స్ ప్రారంభించగా, అందరి దృష్టి ఇప్పుడు ఒకే విషయంపై ఉంది.. రాజమౌళి దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'వారణాసి' సినిమా నుంచి ఏదైనా ప్రత్యేక అప్‌డేట్ వస్తుందా అని? దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న 'వారణాసి' ప్రస్తుతం భారతీయ సినీ పరిశ్రమలో అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందుతున్న ప్రాజెక్ట్‌లలో ఒకటిగా నిలిచింది. అడ్వెంచర్ నేపథ్యంలో భారీ బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ చిత్రంపై దేశవ్యాప్తంగా మాత్రమే కాదు, అంతర్జాతీయ స్థాయిలో కూడా ఆసక్తి నెలకొంది. 'ఆర్ఆర్ఆర్' వంటి ప్రపంచవ్యాప్త విజయానంతరం రాజమౌళి తెరకెక్కిస్తున్న సినిమా కావడంతో ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు మరింత పెరిగాయి. మహేష్ బాబు కూడా ఈ సినిమా కోసం పూర్తిగా కొత్త లుక్, ప్రత్యేకమైన ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్‌తో కనిపించనున్నట్లు సమాచారం. చిత్ర బృందం ఇప్పటికే సినిమా షూటింగ్‌లో కీలక భాగాన్ని పూర్తి చేసినట్లు సమాచారం. ప్రస్తుతం మరికొన్ని భారీ యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ కొనసాగుతోందని సినీ వర్గాలు చెబుతున్నాయి. సినిమా లుక్ గోప్యంగా ఉండేలా రాజమౌళి ప్రత్యేక జాగ్రత్తలు తీసుకుంటున్నారని, అందుకే మహేష్ బాబు ఇటీవల కాలంలో పబ్లిక్ ఈవెంట్లకు కూడా చాలా తక్కువగా హాజరవుతున్నారని తెలుస్తోంది. మహేష్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఆయన సినిమాలకు సంబంధించిన పోస్టర్, టీజర్ లేదా గ్లింప్స్ విడుదల చేయడం గత కొన్నేళ్లుగా ఆనవాయితీగా వస్తోంది. ఈ నేపథ్యంలో ఈ ఏడాది కూడా 'వారణాసి' నుంచి ప్రత్యేక అప్‌డేట్ ఉంటుందనే ఆశతో అభిమానులు ఎదురుచూస్తున్నారు.అయితే ఇప్పటివరకు చిత్ర బృందం నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. దీంతో ఈసారి కూడా ఫస్ట్ లుక్, పోస్టర్ లేదా చిన్న గ్లింప్స్ విడుదల చేస్తారా? లేక మరికొంత సమయం వేచి చూడాలని చెబుతారా? అనే ఉత్కంఠ అభిమానుల్లో నెలకొంది.ఈ చిత్రంలో ప్రముఖ నటి ప్రియాంక చోప్రా కీలక పాత్రలో నటిస్తున్న సంగతి తెలిసిందే. అంతర్జాతీయ వేదికలపై ఆమె ఈ సినిమా గురించి, రాజమౌళి విజన్ గురించి ప్రస్తావిస్తూ ఆసక్తిని పెంచుతున్నారు. దీంతో 'వారణాసి'పై గ్లోబల్ మార్కెట్‌లో కూడా మంచి బజ్ ఏర్పడుతోంది.





# 'చైనా పీస్' కాదు ఇకపై 'సీక్రెట్ సోల్జర్'.. రిలీజ్‌కి రెడీ

నిహాల్ కోదాటి, సూర్య శ్రీనివాస్ హీరోలుగా అక్కి విశ్వనాథ రెడ్డి దర్శకత్వంలో తీసిన యూనిక్ స్పై డ్రామా సినిమా 'చైనా పీస్'. మూన్ లైట్ డ్రీమ్స్ బ్యానర్‌పై తెరకెక్కింది. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ మంచి బజ్ క్రియేట్ చేసింది. టీజర్ అంచనాలను మరింత పెంచింది. ఇంతకుముందు 'చైనా పీస్' పేరుతో ప్రేక్షకులకు పరిచయమైన ఈ చిత్రం.. ఇప్పుడు 'సీక్రెట్ సోల్జర్'గా ప్రేక్షకుల ముందుకు రానుంది. సెన్సార్ బోర్డ్.. యూ/ఏ సర్టిఫికెట్ జారీ చేసింది. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని ఈ ఏడాది సెప్టెంబర్‌లో థియేటర్లలో విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సురేష్ రగుతు సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరించగా, మార్తాండ్ కె. వెంకటేష్ ఎడిటర్‌గా పనిచేశారు. కమల్ కామరాజు, తులసి, రఘు బాబు, రంగస్థలం మహేష్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్ తదితరులు ఇతర పాత్రలు చేశారు.

# 'టాక్సిక్' ట్రైలర్ డేట్ ఫిక్స్.. బాక్సాఫీస్ పై యష్ సునామీ!

కన్నడ రాకింగ్ స్టార్ యష్ నటిస్తున్న మోస్ట్ అవేటెడ్ పాన్ వరల్డ్ మూవీ 'టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్' చిత్రానికి సంబంధించి మేకర్స్ తాజాగా ఒక అదిరిపోయే అప్డేట్ అందించారు. సినిమా ప్రమోషన్స్ లో భాగంగా చిత్ర యూనిట్ తాజాగా ట్రైలర్ రిలీజ్ డేట్ ను అధికారికంగా ప్రకటించడంతో పాటు, ఒక సరికొత్త పోస్టర్ ను విడుదల చేసి సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చారు. గీతూ మోహన్ దాస్ అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్న ఈ సాలిడ్ యాక్షన్ డ్రామాపై ఇప్పటికే సినీ వర్గాలలో భారీ అంచనాలు నెలకొని ఉన్నాయి. రీసెంట్ గా రామాయణ ప్రాజెక్ట్ తో పాటు రావణాసురుడి పాత్రలో యష్ గెటప్ మరియు ప్రెజెన్స్ ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆ సినిమా కంటే ముందే బాక్సాఫీస్ ముందుకు రాబోతున్న 'టాక్సిక్' తో యష్ ఏ స్థాయిలో విధ్వంసం సృష్టిస్తాడనే దానిపై సర్వత్రా ఆసక్తి నెలకొంది. ఈ క్రమంలో తాజాగా విడుదల చేసిన బ్లాక్ అండ్ వైట్ పోస్టర్ సినిమా మూడ్ ఏంటో స్పష్టంగా తెలియజేస్తోంది. ఈ పోస్టర్ తో పాటు మేకర్స్ అనౌన్స్ చేసిన వివరాల ప్రకారం, ఈ భారీ బడ్జెట్ యాక్షన్ ఎంటర్‌టైనర్ సినిమా ట్రైలర్ ను వచ్చే ఆగస్టు 8, 2026 న అత్యంత గ్రాండ్ గా లాంచ్ చేయనున్నారు. ఈ చిత్రంలో నయనతార, కియారా అద్వానీ, తారా సుతారియా, రుక్మిణి వసంత్, హ్యూమా ఖురేషి వంటి స్టార్ హీరోయిన్లు, నటీనటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ మరియు మాన్స్టర్ మైండ్ క్రియేషన్స్ సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్ తో ఈ సినిమాను నిర్మిస్తున్నాయి. ఇక కేజీఎఫ్ లాంటి ఇండస్ట్రీ హిట్ తర్వాత కేవీఎన్ ప్రొడక్షన్స్ తో యష్ చేస్తున్న ఈ ప్రాజెక్ట్ పై ప్రపంచవ్యాప్తంగా భారీ అంచనాలున్నాయి.






# 'కొరియన్ కనకరాజు' ట్రైలర్ అదిరింది..

## డ్యూయల్ షేడ్స్, కామెడీతో అంచనాలు పెంచిన వరుణ్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా, దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కిస్తున్న ఇండో-కొరియన్ హారర్ కామెడీ ఎంటర్‌టైనర్ కొరియన్ కనకరాజు పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. ఇప్పటికే విడుదలైన పోస్టర్లు, టీజర్, పాటలు ప్రేక్షకుల్లో మంచి ఆసక్తిని కలిగించగా.. తాజాగా విడుదలైన ట్రైలర్ సినిమాపై ఉన్న హైప్‌ను మరో స్థాయికి తీసుకెళ్లింది. తాజా ట్రైలర్‌ను బట్టి చూస్తే.. ఈ సినిమా పూర్తి స్థాయి కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా రూపొందినట్లు తెలుస్తోంది. అనంతపురానికి చెందిన ఓ సాధారణ యువకుడు, కొరియన్ మాఫియా ప్రపంచం మధ్య జరిగే ఆసక్తికర పరిణామాలే కథకు ప్రధాన బలంగా కనిపిస్తున్నాయి. హారర్, కామెడీ, యాక్షన్ అంశాలను దర్శకుడు మేర్లపాక గాంధీ వినోదాత్మకంగా రూపొందించినట్టు ట్రైలర్ స్పష్టం చేస్తోంది. ఈ చిత్రంలో వరుణ్ తేజ్ రెండు విభిన్న షేడ్స్‌లో కనిపించనున్నట్లు ట్రైలర్ సూచిస్తోంది. ఒకవైపు అనంతపురం యువకుడిగా మాస్ బాడీ లాంగ్వేజ్‌తో అలరిస్తూనే, మరోవైపు కొరియన్ మాఫియా డాన్ పాత్రలో స్టైలిష్ లుక్, స్వాగ్‌తో ఆకట్టుకున్నారు. రెండు పాత్రలకు భిన్నమైన హావభావాలు, బాడీ లాంగ్వేజ్, మేకోవర్‌తో వరుణ్ తేజ్ చూపించిన వైవిధ్యం అభిమానులను ఆకట్టుకుంటోంది. ట్రైలర్‌లో నటుడు సత్య చెప్పిన పంచ్ డైలాగులు నవ్వులు పూయిస్తున్నాయి. ఆయన కామెడీ టైమింగ్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని ట్రైలర్‌ను చూసిన ప్రేక్షకులు అభిప్రాయపడుతున్నారు. హీరోయిన్ రిథికా నాయక్ తన గ్లామర్, స్క్రీన్ ప్రెజెన్స్‌తో ఆకట్టుకున్నారు.

Printed Published, Owned by PEMBI MAHENDHAR Printed at Saketh Publications, 312. Trinetra Complex, Sangareddy, Telangana 502001.
Published from 11-65/49, PEDDAMMAWADA, MALLAPUR, JAGITIAL, TELANGANA - 505331. PH: 9912484184.
Email : navageetamnews@gmail.com PRGI.NO:TGTEL/26/A2002. EDITOR: PEMBI MAHENDHAR.